# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 36 సంచిక 6

పేజీలు 40

ఫిబ్రవరి 2017

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం ....................................................2

శ్రీబాబూజీ ఉవాచ....................................................4

అమ్మమాట....................................................7

భగవన్నామ మహిమ ....................................................9

ఎందరో మహాత్ములు ....................................................11

వివేక దృష్టి ....................................................12

మనస్సును నియంత్రించటం ఎలా?...14

అవ్యభిచార భక్తి ....................................................17

భగవంతుని అవతార విశేషము ..........18

స్పర్శమణి - చింతామణి ....................................................19

సృష్టి క్రమము ....................................................21

యోగవాశిష్ఠము ....................................................23

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................................................25

పరిప్రశ్న ....................................................26

ఆనందమే బ్రహ్మ ....................................................28

రావణుడు రామునకు నేర్పిన నీతి ....31

శ్రీకృష్ణకర్ణామృతము....................................................33

విశ్వామిత్రుడు....................................................35

సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర.....37

విష్ణు కథలు- మీరాబాయి....................................................39

# భద్రవాక్యం

- పరాశర ప్రసాద్

**అచింత్య మవ్యక్త మనన్త రూపం। శివం ప్రశాన్తమమృతం బ్రహ్మ యోనిమ్।**
**తథాదిమధ్యాన్త విహీనమేకం। విభుం చిదానంద మరూపమద్భుతమ్॥**

(కైవల్యోపనిషత్ 6వ శ్లో॥)

తరంగాలలో సముద్రం కనపడదు. ఆభరణాలలో బంగారం కనబడదు.అయినా కూడా తరంగాలన్నీ సముద్రం యొక్క వ్యక్తరూపం, ఆభరణాలన్నీ బంగారం యొక్క వ్యక్తరూపమే. ఆత్మవస్తువు కూడా ప్రపంచంలో నానా రూప దృశ్యంగా అనుభవించే విషయాలుగా అభివ్యక్త మవుతోంది. అయితే నిత్యసత్యమైన పరమాత్మ నుండి దేహమనో బుద్ధ్యాది కరణములన్నీ ఉద్భవించి, ఈ భౌతిక ప్రపంచంగా రూపు దిద్దుకుంది. కాని అది వస్తువు కాదు కాబట్టి, మనోబుద్దులకు అందదు కాబట్టి దానిని అచింత్యం అన్నారు.

ఇంద్రియ గ్రాహ్యం కాదు కాబట్టి అవ్యక్తం అన్నారు. దుఃఖం, రాగద్వేషాలు అనేవి దేహాదులు, మనోబుద్ధుల కలతలు విక్షేపాల ద్వారా కలిగేవి. ఇవి ఆత్మను మలినపరచలేవు. ఆత్మ వీటికి అతీతమైనది. సర్వ వ్యాపకమైనది ఏకమే కదా! అలా కాకపోతే దానికి భిన్నంగా మరొకటి ఉండాలి కదా! అద్వయమైనది. తప్పక అనంత మైనది. అదే సర్వవ్యాపి. దానికి రూపం ఉండదు కాబట్టి దానిని ఏకం అనంతం అంటారు.

మనో బుద్ధులకు అందనిది. ఆశ్చర్యాన్ని కలిగించేది. అద్భుతం అంటారు. ప్రపంచంలో సమస్త దేహమనో బుద్ధులలోగల గ్రహణ శక్తులన్నీ కలిసిన రూపమే యీ విశ్వం. ఆ పరమాత్మలోని సృజన శక్తిగా వ్యక్తం అయిన సృష్టికర్త బ్రహ్మకి జన్మ స్థానము పరమాత్మ. సృజన శక్తికి జన్మస్థానమైన గర్భము పరమాత్మే కాబట్టి బ్రహ్మయోని అని ప్రయోగం చేయబడినది. మార్పు అనేది మర్త్యత్వము, పరిమితత్త్వము సూచిస్తుంది. ఒక అవస్థ గాని దశగాని మారింది అంటే పూర్వావస్థ నశించినట్లే కదా!

భౌతిక ప్రపంచంలో కలిగే మార్పు లేక పరిణామము ఆత్మవస్తువులో గాని, ఆత్మానందంలోగాని ఉండవు కాబట్టి దానిని అమృతత్త్వం అంటారు. దేశకాల, రూపముల చేత పరిమితమైన దానికి

ఆది అంతములు ఉండక తప్పదు.నిదురలోగాని, మూర్ఛలోగాని, మత్తుమందు ఇచ్చినప్పుడు గాని, కాలజ్ఞానం ఉండదు కదా! అలాగే మనోబుద్ధులు అంతర్ముఖమైన ఆత్మానుభూతిలో కాలజ్ఞానానికి తావు ఉంటుందా? అటువంటి స్థితిని ఈ దేహముతో కూడినప్పుడు పొందే అనుభవమే ధ్యానము అని పిలువబడుతోంది.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, ఆశ్రమ స్థిర నివాసులు అయిన శ్రీమతి కూనపరాజు రాజరాజేశ్వరమ్మగారు (నారాయణ రాజుగారి ధర్మపత్ని) 13-1-2017 శుక్రవారం భోగిపండుగ రోజు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 95 సంవసత్సరాలు. వీరు గత కొద్ది సంవత్సరాలుగా ఆశ్రిత ఆశ్రమాన్ని ఆశ్రయించి వున్నారు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఫిబ్రవరి 2017,మార్చి 2017, మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

ఫిబ్రవరి 2017: AS 3702, 5753, 5833, 6032, 6280, 6518, 6520, 7056, 7223
AS 7227, 7228, 7235

మార్చి 2017: AS 4225, 5116, 5302, 6529, 6530, 6534, 7064, 7067, 7070
AS 7075, 7077, 7079, 7080, 7081, 7091, 7092, 7093, 7095
AS 7238, 7239, 7241, 7242, 7243, 7246, 7247.

– మేనేజర్

# శ్రీ బాబూజీ ఉవాచ - పరాశర ప్రసాద్

కార్తీకమాసం ప్రతిరోజూ ఉదయం శ్రీ బాబూజీ మహరాజ్ తో వ్యాహ్యాళిలో పాల్గనే సదవకాశం మాకు కల్గింది. డా॥ కృష్ణార్జునరావు గారు, పురుషోత్తంగారు కూడా వాకింగ్‌లో పాల్గొనేవారు. వారు ప్రతిరోజూ శ్రీ బాబూజీ మహరాజ్ వ్యాహ్యాళికి బయలుదేరిన తరువాత కొంచెం ఆలస్యంగా వచ్చేవారు. శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "మనం పందెం వేసుకుందాం. రేపు ఉదయం వాకింగ్‌కి మీరు ముందర వస్తారో, నేను ముందు వస్తానో చూద్దాం? మనలో ఎవరు గెలుపొందుతారో దైవనిర్ణయానికి వదిలేద్దాం" అన్నారు.



ఆ మర్నాడు శ్రీ బాబూజీ మహరాజ్ ముందుగా వ్యాహ్యాళికి వచ్చారు. తొమ్మిది రౌండ్లు వాకింగ్ పూర్తి అయిన తరువాత డాక్టరుగారు, పురుషోత్తంగారు వచ్చారు. వారిద్దరూ రాగానే శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ పురుషొత్తంగారిని ఉద్దేశించి "మీరే గెలిచారండీ, డాక్టరుగారు ఓడిపోయారు" అన్నారు. వారిద్దరూ ఆశ్చర్యంగా చూశారు. శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "మీరిద్దరూ పందెం వేసుకున్నారు కదా! మీరు వచ్చేటప్పటికి తొమ్మది రౌండ్లు మాత్రమే పూర్తి అవుతాయని పురషోత్తంగారు, అంతకన్నా ఎక్కువ రౌండ్లు అవుతాయని డాక్టరుగారు పందెం వేసుకున్నారు కదా! మరి మేము తొమ్మిదిరౌండ్లు పూర్తిచేశాము. కాబట్టి పురుషోత్తంగారు పందెం గెలిచినట్లే కదా! ఇది నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నారు కదూ! మీ మాటలు వినడానికి నాకు కర్ణభేరి ఉంది. ఎవరు ఏది ఎక్కడ మాట్లాడుకున్నా నాకు తెలిసిపోతుంది" అన్నారు.

పురుషోత్తంగారిని ఉద్దేశించి ఇంకా మాట్లాడుతూ "బాబుగారు నన్ను గట్టిగా ఆలింగనం చేసుకున్నారని మీరు మీ శ్రీమతిగారికి ఏదో చెప్పారనుకుంటాను" అన్నారు. పురుషోత్తంగారు ఆశ్చర్యంగా చూస్తూ "అవును చెప్పాను" అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "అంతవరకే చెప్పారు కానీ దాని ద్వారా పొందిన అనుభూతిని చెప్పారా?

కనీసం మాకు చెప్పండి. మేము వింటాం" అన్నారు. శ్రీ పురుషోత్తంగారు సమాధానం చెప్తూ "అది వర్ణనకి అందేదికాదు, అది బ్రహ్మానందం" అన్నారు. శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "అది ప్రాపంచిక ఆనందంకన్న మించినదంటారా! ఏరా రాజా! నువ్వు మీ ఊరు వెళ్లినప్పుడు తింటావే దానికన్నా గొప్పదంటావా! శ్రీరామా! నువ్వు చెప్ప? పంచదార మీగడకన్నా గొప్పదా? అంతెందుకు? మన మునసుబుగారు నిద్రనిమించిన ఆనందం లేదంటారు. ముద్దపప్పు, ఆవకాయి నెయ్యి అన్నం కన్నా మించిన ఆనందం ఉందా! ఆ విషయం మా తారకం చెప్పాలి. కొందరికి పరువు. ప్రతిష్ఠకి మించిన ఆనందంలేదు. ఏమంటావ్ లాల్?" అని అన్నారు.

ఇంకా మాట్లాడుతూ "ప్రాపంచిక ఆనందంకన్నా పురుషోత్తంగారు పొందిన బ్రహ్మానందం మించినది అయితే మరి ప్రాపంచిక ఆనందాన్నే కోరుకుంటున్నారేమిటండీ పురుషోత్తంగారూ?" అని ప్రశ్నించారు. ఆయన సమాధానం చెప్తూ 'మాయా ప్రభావం చేత ప్రాపంచిక సుఖాలని వదులుకోలేక పోతున్నాను' అన్నారు. శ్రీబాబూజీ మహారాజ్ మాట్లాడుతూ "గురుసాన్నిధ్యంలో మాయకు తావులేదే! గురునామస్మరణ చేసినా, గురుబోధశ్రవణం చేసినా, గురుసేవా కార్యక్రమంలో నిమగ్నమైయున్నా మాయ నీ దగ్గరకు చేరదు. గురు పరమాత్ముని మరచినవాడి సంగతి నేను చెప్పలేను" అన్నారు. శ్రీ రావుగారు మాట్లాడుతూ "గురుసాన్నిధ్యంలో మాయ ఉండదు బాబూ! యథార్థమే, ఎందువలన అంటే మాయను మీరు మా మీదికి ప్రయోగించి, మమ్మల్ని మాయలో పడవేస్తారు" అన్నారు.

శ్రీ బాబూజీ మహరాజ్ మాట్లాడుతూ "లేనిది ఉన్నట్లుగా భ్రాంతి చెందటమే మాయ. వెలుగు లేనప్పుడు వస్తువు గోచరించదు గదా! వెలుగులేని స్థితిని చీకటి అంటాము. మరి వెలుగు రాగానే చీకటి ఎక్కడికి పోయింది? వెలుగులో లయించింది. కాబట్టి వెలుగున్న ప్రదేశంలో చీకటికి తావులేనట్లుగా సద్గురుమూర్తి సన్నిధిలో మాయకు తావులేదు. చీకటి లేక అజ్ఞానము అనేది మీ భావన లేక మీ భ్రమ. దీనిని అర్థంచేసుకోండి. కానీ శాస్త్ర విజ్ఞానానికి, పాండిత్యానికి మాత్రం మాయాశక్తి అందదు. ఇక్కడ మీకొక దృష్టాంతము చెబుతాను. ఒక

దొంగ ఇంట్లోకి ప్రవేశించి చీకటి గదిలోకి వెళ్ళాడు. వస్తువులు ఏవీ కంటికి గోచరించలేదు. అందువలన చేతితోనే వస్తువులన్నిటినీ పరిశీలిస్తున్నాడు. 'ఈ వస్తువులు ఏవీ తనకి పనికిరావు' అనుకుని పారవేశాడు. చివరికి తన చేయి ఇనప్పెట్టె మీద పడింది. ఆఁ... దొరికింది అనుకుంటాడు. సంతోషపడతాడు. అలాగే సాధకుడు వెతికి వెతికి చివరకు బ్రహ్మ సాక్షాత్కారాన్ని పొంది బ్రహ్మానందంలో మునిగిపోతాడు. దొంగకా ఇనుపపెట్టె దొరికిన తరువాత వెదకవలసిన పనిలేనట్లుగా తత్త్వవిచారణచేసే సాధకుడు నిర్గుణ తత్త్వాన్ని తెలుసుకుని బ్రహ్మానందాన్ని చవిచూసిన తరువాత ఇంక ప్రాపంచిక ఆనందాన్ని గూర్చి ఆలోచిస్తాడా! కాబట్టి సాధకుడు ఆవేదన, తపనచెంది తత్త్వవిచారణ ద్వారా తప్పక ఆత్మానందాన్ని పొందుతాడు. దానికి మించిన ఆనందం జగత్తులో ఏ ఒక్కరైనా పొందినట్లు ఋజువు చేయగలరా?" అని ప్రశ్నించారు.

శ్రీ బాబూజీ మహరాజ్ ఇంకా మాట్లాడుతూ "కొత్తగా పెళ్ళైన భార్యాభర్తలిరువురూ శ్రావణమాసంలో అత్తవారింటికి వెళ్ళారు. ఎంతో ఆనందంగా గడిచిపోతుంది. ఆ రోజు ఆ గ్రామంలో తిరునాళ్ళు. చాలా సందడిగా ఉంది. భార్యాభర్తలు తిరునాళ్ళు చూడడానికి బయలుదేరి వెళ్ళారు. వారిద్దరూ అన్నీ సందర్శించి ఇంటికి బయలుదేరి వస్తున్నారు. ఇంతలో భర్తకి దాహం వేసింది. భార్యతో మాట్లాడుతూ "లక్ష్మీ! ఇక్కడే వుండు. నాకు దాహం వేస్తోంది సోడా తాగి వస్తాను" అని వెళ్ళాడు. ఆ ప్రదేశంలో జనం తొక్కిసలాట ఎక్కువై భార్యాభర్త లిరువురూ విడిపోయారు. భార్య భర్తను గురించి, భర్త భార్యను గురించి ఎంతో తీవ్ర ఆవేదన చెందారు. వెంటనే ఆ భార్యాభర్తలిద్దరూ కలుసుకున్నా రనుకోండి. వారు పొందే ఆనందానికి అవధులుంటాయా? మరి ఈ ప్రాపంచిక ఆనందంకోసమే ఆ భార్యాభర్తలిద్దరూ ఎంత ఆవేదన చెందారు? మరి అంతటి తపన, ఆవేదన చెందిన భక్తుడు ఆత్మసందర్శన పొందలేడా? అప్పుడు ఆ భక్తుడు పొందే బ్రహ్మానందానికి మించిన ఆనందం ఈ జగత్తులో ఉందా?" అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## కర్మలో అకర్మ

"శాస్త్రం అనంతమైనది. కానీ మన కాలం చాలా అల్పంగా వుంది. 'శ్రేయాంసి బహు విఘ్నాని' అన్నట్లుగా మనకి అనేక విఘ్నాలు ఎదురు అవుతుంటాయి. కనుక హంస ఏ విధంగా నీటిని వదిలేసి, పాలనే గ్రోలుతుందో, మనం కూడా శాస్త్రంలోని సారమేదో దానినే గ్రహించాలని చెప్తోంది 'ఉత్తర గీత'.



సాధకుడైనటువంటివాడు చాలా జాగ్రత్తగా ఉండాలి. 'నేను సాధన చేస్తున్నాను' అని అనుకుంటున్నంత సేపూ సాధన జరగనట్లే. 'నేను' చేస్తున్నాను అన్నది పోవాలి. సాధుపురుషుల సాంగత్యం చేయాలి. మంచిని వినాలి. విన్నది మననం చేసి, దానిని గురించి విచారణ చేసుకోవాలి. విచారణ చేయగా, చేయగా అది నిదిధ్యాసకి వస్తుంది. సాధకుడికి కావలసినవి ఇవి మూడేకదా - శ్రవణ, మనన, నిదిధ్యాసలు. ఏ విషయాన్ని గురుదేవులు మనకి అందిస్తున్నారో, దాని గురించి నిరంతర విచారణ చేయటమే 'ధారణ'.

శ్రీ గురుదేవులు చెప్పినట్లు రేడియోలో విజయవాడ స్టేషన్‌లో వచ్చే పాటలు వినాలంటే ముల్లు విజయవాడ మీదనే నిలవాలి. అప్పుడే నీకు కావలసిన పాటలు వినగలుగుతావు. అదే విధంగా చెప్పే విషయం మీద నీ మనస్సు నిలబడాలి. అదే 'ధారణ'. నీవు వినే విషయము యందు అనురక్తి కలిగి ఉండటమే ధారణ.

దుర్గమమైన 'దేహమే నేను' అనే భావనే దుర్గడనే రాక్షసుడు. వాడిని సంహరించే శక్తి కేవలం ఆ దుర్గాదేవికే ఉంది. ఆ దుర్గాదేవియే గురుమాత. 'దేహమే నేను' అనే ఆవరణని భేదించే వారు ఒక్క శ్రీగురు దేవులు మాత్రమే.

సాధకులకు అనేకానేక ప్రశ్నలు, సందేహాలు వస్తూ ఉంటాయి. ఈ మధ్య నన్ను ఒకరు అడిగారు 'గురువులను ఆశ్రయించాక కూడా కర్మ అనుభవించాలా?' అని. కర్మ అనేది ఎవరైనా అనుభవించక తప్పదు. అయితే శ్రీగురుదేవుల నాశ్రయించిన వారికి రోకలి దెబ్బ తగలవలసిన చోట, చిన్న గోటి దెబ్బతో తప్పిపోతుంది. మనం సంచితాన్ని అంటే పూర్వ జన్మల నుండి తెచ్చుకున్న కర్మని మోస్తున్నాము. ఇక ముందు కర్మ అంటే ఆగామి కర్మ రాకుండా యిప్పుడు ప్రారబ్ధంలో జాగ్రత్తపడవచ్చు. కానీ ప్రారబ్ధ కర్మ మాత్రం ఎవ్వరైనా సరే అనుభవించి తీరవలసినదే. ఇప్పుడు, వర్తమానంలో అనుభవించే కర్మ 'ప్రారబ్ధ కర్మ' అవుతోంది.

శ్రీగురుదేవులు చెప్పినట్లు, గుప్పెడు ధాన్యపు గింజలు జల్లితే, కుంచెడు ధాన్యం వచ్చినట్లు, కర్మలు చేస్తున్న కొద్దీ, మనకి పునరపి జననం, పునరపి మరణం అనే వలయం నుండి తప్పించుకోవడం దుర్లభం. అలా అన్నారని, కర్మలు మానమని చెప్పడం లేదు. కర్మ ఫలముల యందు ఆసక్తిని వదిలి, కర్మఫలాపేక్షను వదిలి, నిష్కామంగా కర్మను ఆచరించాలని మహాత్ములు మనకి ఉద్బోధిస్తున్నారు. అట్టి నిష్కామ కర్మ మనని బంధించదు. అదే కర్మలో అకర్మ.

వేయించిన బీజాలకి తిరిగి మొలక వుండదు. అదే విధంగా ధ్యానాగ్నిలో మన కర్మలని రహితం చేసుకున్ననాడు మనకి పునరావృత్తి వుండదు. అలాగే, వడ్లగింజకి రెండు పొరలు తీసివేసినట్లు, మనలోని అహంకార, మమకారాలనే రెండుపొరలు తీసివేస్తే మనలోని బీజాంకురం నశిస్తుంది. వడ్లగింజకి తిరిగి మొలక వస్తుంది కానీ, బియ్యపుగింజకు మొలక లేదు.

కనుక శ్రీ గురుదేవులు ప్రసాదించిన నామధ్యానం అనే అగ్నిలో మన కర్మలను పడవేద్దాం. దీనికి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను, అఖండ సాధన సంపత్తిని ప్రసాదించి, శ్రీగురుపాదుకలు మనలను సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# భగవన్నామ మహిమ

- పరాశర ప్రసాద్

గోస్వామి తులసీదాసు తన రామచరిత మానస్ అనే గ్రంథంలో భగవన్నామ మహిమను గురించి ప్రస్తావించటం జరిగింది. నామ మహిమ ఎంత గొప్పదో భగవంతుడు కూడా చెప్పలేడేమో. 'రామ న సకహి నామ గుణగాయీ' అన్నది ఆ విషయాన్ని తెలియజేస్తోంది. శ్రద్ధా భక్తులు లేకపోవటమే ఆ నామ మహిమను గురించిన భిన్నాభిప్రాయాలకు కారణం. భగవన్నామ మహిమను గుర్తించని శిష్యునిగాథ తెలుసుకుందాం.

శ్రద్ధాభక్తి లేని కారణంగా సమర్థులైన సద్గురుమూర్తిని ఆశ్రయించినా భగవన్నామ మహిమని గుర్తించని శిష్యుని వుద్ధరించటానికి అన్నట్లుగా గురువుగారు శిష్యుడిని పిలిచి, ఒక మెరుస్తున్న రాయినిచ్చి 'నగరానికి వెళ్ళి దీని ధర ఎంత ఉంటుందో తెలుసుకుని రా! ఎట్టి పరిస్థితులలో దీనిని అమ్మవద్దు జాగ్రత్త సుమా!' అని హెచ్చరించి పంపారు. శిష్యుడు ఆ రాయిని తీసుకుని బజారుకు వెళ్ళాడు. ఆ రాయిని ఒక కూరగాయాలు అమ్ముకునే వ్యాపారికి చూపించి దాని విలువ కట్టమని ప్రశ్నించాడు. ఆ వ్యాపారి మాట్లాడుతూ యీ రాయి నా తూకానికి పనికి వస్తుంది. దీనిని నాకిచ్చి, దీనితో సరితూగగల ఏ కూరనైనా తీసుకువెళ్ళమన్నాడు. దానికి ఆ శిష్యుడు సమ్మతించలేదు. ఆ రాయిని తీసుకుని బంగారం వ్యాపారం చేసేవాడివద్దకు వెళ్ళాడు.

ఆ వ్యాపారి ఆ రాయి తన షాపులో అలంకారానికి పనికి వస్తుందని గ్రహించి, నూరు రూపాయలు ఇస్తానని చెప్పటం జరిగింది. శిష్యుడు ఆ వ్యాపారి ఇవ్వదలచిన మూల్యాన్ని తిరస్కరించి ముందుకు సాగిపోయాడు. శిష్యుడు ఆ రాయి విలువైనదానిగా గుర్తించాడు. అలా గుర్తించిన మరుక్షణం ఒక వజ్రాల వ్యాపారిని కలిశాడు. ఆ వ్యాపారి ఆ రాయిని ఒక విలువైన వజ్రంగా గుర్తించాడు. 'ఈ వజ్రం నీకెక్కడిది? నీవు దీనిని ఎక్కడి నుండి దొంగిలించావు?' అని ప్రశ్నించి, అతడుండే స్థావరాన్ని గుర్తించి, శిష్యునితో కలిసి ఆశ్రమానికి చేరుకుని, ఆ గురువు గారితో "మీ శిష్యుడు ఎక్కడినుండో ఈ వజ్రాన్ని దొంగిలించి, దాన్ని

నాకు అమ్మజూపాడు" అని ఫిర్యాదు చేశాడు వ్యాపారి.

గురువుగారు సమాధానం చెబుతూ "తన శిష్యునికి తగిన గుణపాఠం చెప్పటానికి తానే స్వయంగా ఆ రాయిని దాని విలువెంతో తెలుసుకు రమ్మనమని పంపించాను" అని చెప్పాడు.

గురువుగారు వెంటనే తన ప్రక్కనే ఉన్న ఇనుప గరిటకి దానిని తాకించిన వెంటనే అది బంగారు గరిటగా మార్పు చెందింది. అది గమనించిన వజ్రాల వ్యాపారి, శిష్యుడు ఆశ్చర్యపోయారు!

"ఇది పరశువేది. ఈ రాయి ఇనుమును తాకితే అది బంగారంగా మారిపోతుంది. ఈ వస్తువుకే ఇంత శక్తి ఉంటే, దీనికి శక్తినిచ్చిన ఆ భగవన్నామ విలువను గుర్తించారా! ఇంతకాలం నుండి ఇక్కడ ఆశ్రమంలో నా సన్నిధిలో ఉంటూ కూడా భగవన్నామ విలువవి గుర్తించ లేకపోవటానికి కారణం ఏమిటి? శ్రద్ధ లేకపోవటమే.

ఇప్పటికైనా ఆ భగవన్నామ విలువను గుర్తించండి. భగవన్నామాన్ని మామూలు రోగాల కోసం కాకుండా, భవరోగం రహితం అవ్వటానికి వినియోగించండి. భగవన్నామాన్ని మామూలు రోగాలు పోవటానికి వినియోగించి ప్రతిఫలం పొందలేదని నిరాశతో విశ్వాసాన్ని కోల్పోకండని" శిష్యుల్ని హెచ్చరించారు గురువుగారు.

## కనక - కలవరింత

మృత్యు శయ్యపై వున్న ధనికుడు 'కనక' అంటున్నాడు. వారసులు గందరగోళ పడ్డారు. ఏ నిధి రహస్యం చెబుతున్నాడో! అని డాక్టరు చేత ఖరీదైన ఇంజెక్షన్ ఇప్పించారు.

వాడు 'కరు కస బలికెయన్ను కడియుత్తదె' అన్నాడు. - 'దూడ చీపురును కొరుకుతోంది' అని దాని అర్థం.

రూపాయి ఖరీదు చేసే చీపురు ధ్వంసం అవుతోందే అని వాడి దుఃఖం. ప్రాణ ప్రయాణ సమయంలో సాధకులు కానివారికి యిటువంటి భావాలే కలుగుతాయి!

- వి.వి.ఆర్ ప్రసాదరావు

# ఎందరో మహాత్ములు

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

మనం ఏ పని చేసినా దానికి రెండు ప్రయోజనాలు ఉండాలని ఆర్ష ధర్మం నిర్ణయించింది. - ఆత్మనో మోక్షార్థం జగద్ధితాయ చ - 1. మనకు మోక్షం కలగటం, 2. జగత్తుకు హితం కలగటం. ఈ రెండు ప్రయోజనాలు కలిగించలేని పనులన్నీ మనకు కర్మలుగా చుట్టుకుంటాయి. చివరకు మనం తినే ఆహారం కూడా భగవంతుని నివేదన కోసం వండి మనం భుజించాలిగాని, మన రుచుల కోసం, మన ఆకలి కోసం కాదు అని - యజ్ఞ శిష్టామృత భుజః యాన్తి బ్రహ్మ సనాతనం । భుఞ్జ తేత్వఘం పాప యే పచంత్యాత్మ కారణాత్ ॥ - వంటి గీతా వాక్యాల ద్వారా చెప్పబడింది.

'ఒక యోగి ఆత్మకథ' అనే గ్రంథంలో శ్రీపరమహంస యోగానంద వారు తమ తల్లిదండ్రులు కేవలం సంతానప్రాప్తి అనే ధర్మం కోసం సంవత్సరానికి ఒక్కసారి మాత్రమే సంసారం చేశారని వ్రాశారు.

ఇటువంటి ధర్మానికి మూలస్థంభాలనదగిన ఎందరో మహాత్ములు ఏకాంతంగా సాధన చేసుకుని మోక్షాన్ని పొందుతున్నారు. అయితే అలా పొందిన వారిలో కొద్దిమంది మాత్రమే మళ్ళీ సద్గురువులుగా వచ్చి జనబాహుళ్యాన్ని సన్మార్గంలో నడిపించి ఉద్ధరిస్తున్నారు. మరి అలా కాకుండా ఏకాంతంలో ఉండిపోయిన మహాత్ముల వలన జగద్ధితం ఎలా సమకూరుతుంది? అనే ప్రశ్న సహజంగా ఉత్పన్నమవుతుంది.

దీనికి సమాధానంగా శ్రీబాబూజీమహరాజ్‌వారు తమ బోధలో ఎన్నోసార్లు ఇలా చెప్పేవారు - "ఎందరో మహాత్ములు హిమాలయాలలో, అడవులలో, కొండగుహలలో తపస్సు చేసుకుంటూ, ప్రతి ఉదయం తమ సాధన నుండి బయటకు వచ్చి తమ తపశ్శక్తినంతా ధారపోసి, 'సర్వేజనాః సుఖినో భవన్తు । లోకాస్సమస్తా సుఖినో భవన్తు।' అని ఆశీర్వదించి తిరిగి తమ సాధనలో లీనమవుతూ ఉంటారు. వారెవరో యీ లోకానికి పరిచయం లేకపోయినా కేవలం వారి ఆశీస్సుల వల్లనే ఈ లోకం ఇలా పచ్చగా కళకళలాడుతోంది. అందుకు మనం వారందరికీ ఎల్లప్పుడూ కృతజ్ఞులమై ఉండాలి.

# వివేక దృష్టి

- రమణ ప్రసాద్

"వడిరా కాలము, సుడిరా మోహము పడితే హరి గోవిందా! సంవత్సరాలు, నెలలు, రోజులు గడిచిపోతున్నాయి. పోయిన కాలం తిరిగిరాదు. కాల ప్రవాహంలో పడి కొట్టుకుపోకుండా మనందరినీ ఒక చోట చేర్చి, మనని నడిపిస్తూ, ఇతర చింతలలో పడకుండా *'వారం వారం'* - అంటే మాటిమాటికీ సంవత్సరాంతంలో ధనుర్మాస కార్యక్రమాలు మనకు శ్రీ గురుదేవులు ప్రసాదించారు.

బయట వాతావరణం చూస్తే భయం ఆవహిస్తుంది. 'మంచినే ఆలోచించు, చెడు ఆలోచించకు' అని శ్రీ గురుదేవులు బోధించారు. అంతేకాదు ఆ వాతావరణ ప్రభావం మనపై పడకుండా తమ పాద సన్నిధిలో మనకు ఆశ్రయం కల్పించారు.

'సర్వకాల సర్వావస్థలలో నీ సమయాన్ని భగవన్నామ స్మరణలో గడుపు. అలా చేయటం లేదా? చెయ్యకపోతే ఇక ముందు చెయ్యి' అన్నారు శ్రీ గురుదేవులు.

శ్రీ గురుబోధా శ్రవణం చెయ్యి. శ్రవణం మనకి దూరంగా లేదు. నీలో ఉన్న హృదయబాబు నిన్ను మాటికి మాటికీ హెచ్చరిక చేస్తున్నాడు. కాల ప్రవాహాన్ని ఆపలేము. 'అన్నిటికన్నా విలువైనది కాలం' అని శ్రీ గురుదేవుల వాక్కు. దానిని గుర్తించి నీ కాలాన్ని సద్వినియోగం చేసుకో.

ప్రతీదానిలో ఇది సత్యమా కాదా? ఇది నిత్యమా కాదా? అనే విచారణే నిత్యానిత్య వివేకము. అంటే మనం తీసికొనే ఆహారంలో, మనం చేసే ప్రతి పనిలో , మన చేతలలో వివేక దృష్టి కలిగి వుండటం.

ఈ ప్రపంచమనే విషయ వలయంంలో మనని దిగజారకుండా చేస్తుంది నిరంతర భగవత్ స్మరణ. 'స్వామీ! ఎట్లా నడిపించుకుంటావో నీ దయ!' అని మనసారా ప్రార్థించాలి. మన తల్లి దండ్రులనీ మన తాత ముత్తాతలందరికీ దిక్కు ఆ దేవుడే. ఆ

దేవుడే మన గురుదేవులు.

ఒకసారి ఒక భక్తుడు ఇలా ప్రశ్నించాడు -'బాబూ! మీరే దేవుడు కదా! మీరెందుకు పూజ చేస్తున్నారు?' అని అడిగితే దానికి సమాధానంగా 'నేను చేస్తుంటేనే మీరు చెయ్యటం లేదు. నేను చెయ్యకపోతే మీరు చేస్తారా?' అన్నారు.

ప్రతి విషయంలో వివేక దృష్టి కలిగి ఉండాలి అని చెప్పాను కదా! అది శాస్త్రాధ్యయనం వలన వచ్చేది కాదు. గురుదేవులు చెప్పినది చెప్పినట్లు చేస్తేనే వస్తుంది. గురుదేవులు మనలను ఎలా చేయి పట్టుకొని నడిపిస్తున్నారో దానికి తార్కాణం - ఈ మధ్య పెను తుఫాను వచ్చినప్పుడు విశాఖ పట్టణంలో జరిగిన సత్సంగ సమావేశాలే. సత్సంగాల ముందు నేను అడిగాను. 'అమ్మా! ఇక్కడ అంతా ప్రశాంతంగా ఉంది. ఈ తుఫాను ప్రభావం చెన్నై వైపు మళ్ళింది' అన్నారు. ఇటువంటి అనేకమైన దివ్యానుభవాలను ప్రసాదిస్తున్నారు మన గురుదేవులు. వారే సృష్టికి కర్త, హర్త, భర్త. పంచమహా భూతాలను నిర్దేశించేదీ, ఆజ్ఞాపించేదీ వారే.

మన జీవితాలు బుద్బుద ప్రాయాలు. మన జీవితాలని ఎంత వరకు మనం సంస్కరించుకుంటున్నాము? అని ఎవరికి వారు విచారణ చేసికోవాలి. మనం అనుభవించే భోగ భాగ్యాలు ఇచ్చేది వారే. వారికి మనం ఏం సమర్పించగలుగుతాము?

కాబట్టి మనం శ్రవణానికి ప్రాధాన్యం ఇచ్చి, మంచిని వింటూ, మంచిని చేస్తూ, ఈ ప్రపంచంలో వివేక దృష్టితో మెలగాలి. అంటే వివేక దృష్టితో నడవటం, వివేక దృష్టితో మాట్లాడటం, వివేక దృష్టితో అనుభవించటం వంటి జాగ్రత్తలు తీసికోవాలి. అటువంటి శక్తిని, భక్తిని, సాధనా సంపత్తిని శ్రీ గురుదేవులు మనందరికీ ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. సుఖీభవ! సుఖీభవ!!" అని తమ ప్రసంగాన్ని ముగించారు శ్రీ మాతాజీ.

# మనస్సును నియంత్రించటం ఎలా?

- రమణ ప్రసాద్

ప్రతి సాధకునికి మనస్సను ఎలా నియంత్రించాలి? అనే సందేహం తరచుగా వస్తుంది. 'మనసా ఎటులోర్తునే, నా మనవిని చేకొనవే' అని తన మనస్సుకు విన్నవించుకొన్నారు శ్రీ త్యాగరాజ స్వామివారు.

సర్వ సంసారమును మాసంబున నొదవు,
సర్వ సంసారమును మాసనంబున నుండు,
సర్వ సంసారమును మాసనంబున నడుఁగు,
సర్వ సంసారమును మాసనంబె యగును.

- శ్రీ సీతారామాంజనే సంవాదము.

'దారా పుత్రులు ,బంధు మిత్రుల రూపమైన సంసారమును కలిగించేది, వృద్ధి చేసేది, నశింప చేసేది మనస్సే.'

యతో నిర్విషయస్యాస్య మనసో ముక్తిరిష్యతే ।
తతో నిర్విషయం నిత్యం మనఃకార్యం ముముక్షుణా॥

- అమృతబిందూపనిషత్తు

'విషయాసక్తము కాని మనస్సు ముక్తిని కలగ జేస్తుందని చెప్పబడినది. కావున ముముక్షువైనవాడు తన మనస్సను విషయరహితం చేసికోవటమే తక్షణ కర్తవ్యమై ఉన్నది.'

మనస్సును నియంత్రించటానికి ఎన్నో సాధనలను మహాత్ములు తెలిపి ఉన్నారు. అవి సరిగ్గా ఆచరించాలనే ఉద్దేశంతోనో మరే కారణంతోనో వారు వీటిని సాధనా రహస్యాలు అనీ, గుహ్యతమములనీ అన్నారు. వారు తెలిపినవాటిలోని మూడు ముఖ్యమైనవాటిని గురించి మనం తెలుసుకొదాం. అవి 1.నిర్విషయ స్థితి(Thoughtless state ); 2.మనో నిరీక్షణ(Mindful state)
3.వర్తమానంలోజీవించు (Live in the present). ఇవి మీరు చేసే సాధనకు ఉపకరణాలు మాత్రమే.

**1. నిర్వికల్ప స్థితి -**

మనస్సులో సంకల్పాల వస్తుంటాయి. వాటిని నిరోధించవద్దు. సంకల్పాలు మనకు శత్రువులు కావు. ఈ ధ్యాన ప్రక్రియ సంకల్పాలని నిరోధించటానికి

ఉపయోగిస్తుంది. సుఖాసనంలో కూర్చుని మనస్సులో వచ్చే సంకల్పాలను సాక్షీభావంతో చూడాలి. నీలో వచ్చే



సంకల్పాలను వివేక దృష్టితో చూసి సంకల్పాలను కదిలి పోయే మేఘాలలా చూడాలి. సంకల్పం వచ్చినప్పుడు శ్వాసపైకి దృష్టి మరల్చాలి. సాధన చేసినకొలదీ సంకల్పానికి సంకల్పానికి మధ్య వ్యత్యాసం పెరిగి, సంకల్పాలు మనో పథంలో నుండి తొలిగి, మనస్సునిశ్చల స్థితి పొందుతుంది.



**2. మనో నిరీక్షణ -** మనస్సు నిశ్చల స్థితి కలగటానికి 'మనో నిరీక్షణ' మంచి సాధనం. ధ్యానముద్రలో ఉండి నీలో వచ్చే సంకల్పాలను నిరీక్షించు. ఒక సంకల్పం వస్తే దానిని మనో నేత్రంతో 'ఒకటి' అని లెక్క పెట్టు. రెండవ సంకల్పం వస్తే దానిని 'రెండు' అని లెక్క పెట్టు. ఈ విధంగా చేస్తే నీ మనస్సు సంకల్పాల నుండి బయటపడి నువ్వు వేసే లెక్క మీద కేంద్రీకృతమవుతుంది. అంతేకాదు నీలో వచ్చే సంకల్పాలు క్రమ క్రమంగా తగ్గిమనస్సు నిశ్చల స్థితికి వస్తుంది.

**3. వర్తమానంలో జీవించు -**

'గతం గురించి దుఃఖించకుండా, భవిష్యత్తు గురించి ఆరాటపడకుండా వర్తమానంలో వివేకవంతంగా జీవించటంలోనే నీ మనః శరీరాలు స్వస్థత చెందే పరమ రహస్యం దాగి ఉంది.' - బుద్ధుడు

నువ్వు వర్తమానంలో లేకపోతే మిథ్యాలోకంలో ఉన్నట్లే. మనం వర్తమానంలో ఉండకుండా తరచు గడిచిన విషయాల గురించి, రాబోయే



విపత్తులను ఊహించుకుంటూ దుఃఖాల పాలవుతున్నాం. ఈ కారణం వల్ల మనస్సు ఎంతో అలజడిచెందుతోంది. అలా కాకుండా వర్తమానంలో ఉంటే మనస్సుకు ఎంతో ప్రశాంతత లభిస్తుంది. వర్తమానంలో ఉండటం అంటే మనకు ఎదురయ్యే సుఖ దుఃఖాలను స్వీకరించటమే. మనం చేసే తప్పిదాలను గ్రహించి సరైన మార్గంలో నడవటమే. ఏది ఎలా జరుగుతుందో అలా జరుగుతుంది అని నిర్ధారణకు వస్తావు. అప్పుడు శాంతి నీ సొమ్ము అవుతుంది.

అంత్య కాలంలో ఎవడు ఏ యే భావనలో ఉంటూ దేహాన్ని విడుస్తాడో వాడు అట్టి సంస్కారాన్నే మరుజన్మలో పొందుతాడు అన్నాడు భగవానుడు భగవద్గీతలో ..............

తస్మాత్సర్వేషు కాలేషు, మామనుస్మర యుధ్యచ ।
మయ్యర్పిత మనోబుద్ధిః మామేవైష్యస్య సంశయః ॥

- భగవద్గీత (అక్షర పరబ్రహ్మయోగం)

'కాబట్టి ఓ అర్జునా! ఎల్ల కాలములయందు నన్నే స్మరిస్తూ, యుద్ధం (స్వధర్మం)చెయ్యి. ఈ విధంగా నాయందు సమర్పించిన మనోబుద్ధులు కలిగి ఉంటే నీవు నన్నే పొందుతావు' అని ఉపదేశం చేశాడు భగవానుడు.

మనస్సు అచేతనము అనే విషయాన్ని గుర్తించి సాధకుడు నేను స్వయం ప్రకాశమగు బ్రహ్మమును అని సచ్చిదానంద స్వరూపుడ వుతున్నాడు. అంటే వర్తమానంలో బ్రహ్మాకారవృత్తిలో ఉన్నవాడు. అట్టివాడే జీవన్ముక్తుడు.

## అద్దె ఇల్లు

ఒక ఆఫీసరు ఒక ఊరికి బదలీ అయివచ్చి ఒకపెద్ద మనిషి యింట్లో అద్దెకు దిగాడు. ఆ ఇల్లు బంగళా. ఆఫీసరుకు అది బాగా నచ్చింది. ఇల్లు ఖాళీ చెయ్యనంటాడు. ఆ ఇంటి యజమాని బలవంతంగా పోలీసులు సహాయంతో అతనిని ఖాళీచేయించాడు.

మన దేహమే ఇల్లు. జీవుడే ఆఫీసరు. ప్రార్థన, ధ్యానం ఆ యింటికి చెల్లించే అద్దె. అవి మానటమే అద్దె ఎగగొట్టటం. భగవంతుడే ఆ ఇంటికి స్వంతదారు.

- వి.వి.ఆర్ ప్రసాదరావు

# అవ్యభిచార భక్తి

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

మనకి మనం గొప్ప భక్తులమని భ్రమపడుతూ ఉంటాం. పూజలూ, వ్రతాలూ, దీక్షలూ ఎంతో శ్రద్ధగా చేస్తాం. కాని అవి పూర్తవగానే 'హమ్మయ్య! ఓ పనైపోయింది' అనుకుని మళ్ళీ విషయాదుల వెంట పరుగెడతాం. దీనినే వ్యభిచార భక్తి అంటారు.

ఒక వ్యభిచారిణియైన స్త్రీ తన భర్తకు ఎన్ని సేవలు చేసినా, ఆమె మనస్సు ఎప్పుడూ 'భర్త ఎప్పుడు బయటకు పోతాడా, ఎప్పుడెప్పుడు ప్రియుణ్ణి కలుసుకుందామా' అని ఆరాటపడుతూ ఉంటుంది. మన భక్తి కూడా అలాంటిదే.

మరి మనం పనులన్నీ మానుకొని ఎప్పుడూ పూజలూ, భజనలూ చేస్తూ కూర్చోవాలా? అనే ప్రశ్న ఇక్కడ సహజంగా వస్తుంది. - అవసరం లేదు. ఒక పతివ్రతయైన స్త్రీ తన భర్త ఊళ్ళో లేకపోయినా పనులన్నీ మామూలుగానే చేసుకుంటుంది. కానీ ఏ పని చేస్తున్నా తన భర్త ఎలా ఉన్నాడో, ఇప్పుడు ఏం చేస్తున్నాడో, సరిగ్గా తిన్నాడో లేదో అని ఆలోచిస్తూనే ఉంటుంది. అలా మనం ఏం చేస్తున్నా నిరంతరం భగవంతుని గూర్చి ఆలోచిస్తూ ఉండటమే 'అవ్యభిచార భక్తి.'

తల్లికి ఎప్పుడూ తన పిల్లల సంక్షేమం గురించే చింత కదా. అందుకే ఘోరరాక్షసుల బారి నుండి తనను రక్షించడానికి అనేక మారులు, వివిధ అవతారాలు ధరించి వచ్చిన జగన్నాథుని ఆ తల్లి భూమాత అడిగిన ప్రశ్న "ప్రారబ్ధాన్ని అనుభవించటానికి జన్మించిన మానవులకు అవ్యభిచార భక్తి ఏవిధంగా అలవడుతుంది స్వామీ?" అని.

అందుకు స్వామి చక్కని పరిష్కారాన్ని సూచించారు "ఎవరైతే తమ జీవితంలో భగవద్గీతను అభ్యాసం చేస్తారో వారు అవ్యభిచార భక్తిని కలిగి, ముక్తులై, కర్మలు అంటక సుఖంగా జీవిస్తారు" అని. ఇక్కడ గమనించ వలసిన ముఖ్యవిషయం కేవలం గీతాధ్యయనం సరిపోదు. గీతాభ్యాసం కావాలి. అంటే కేవలం 'థియరీ'ని అర్థం చేసుకుని, బట్టీ కొడితే సరిపోదు. దానిని 'ప్రాక్టికల్'గా నిత్యజీవితంలో ఆచరించాలి.

## భగవంతుని అవతార విశేషము - గాలి జగదీశ్

ఒక రాజ్యంలో ఒక రాజుగారు భగవంతుని అవతారం ఎత్తడాన్ని విశ్వసించేవాడు కాదు సరికదా, తన మంత్రులతో ఈ విషయాన్ని ఖండిస్తూ తన అవిశ్వాసాన్ని ప్రకటించేవాడు. చాలాసార్లు మంత్రి రాజుగారికి ఈ విషయంపై భగవంతుడు తన భక్తులకొరకు అవతారం ఎత్తుతాడు అని ఎంతగానో నచ్చజెప్పజూసేవాడు. దానికి రాజుగారు "భగవంతుడు భక్తులను రక్షించడానికి తన అనుచరులను పంపవచ్చు కదా! తానే స్వయంగా రావడం ఎందుకు?" అని వితండ వాదన చేసేవాడు. ఇక ఆ మంత్రి సమయం చూసి రాజుగారికి తెలియజేయటం ఉత్తమమని ఆలోచించి అంతటితో ఊరుకున్నాడు.

ఒకరోజు రాజుగారు మంత్రితో, సేనాపతులతో, కలిసి తన కుమారుణ్ణి కూడా వెంటబెట్టుకుని నౌకా విహారానికి బయలుదేరాడు. ఇదే సమయమని ఎంతకాలం నుండో అవకాశం కోసం ఎదరు చూస్తున్న మంత్రి ఒక పెద్ద బండరాయిని కూడా తన పడవలో భద్రపరచు కున్నాడు. పడవ నది మధ్యలోకి వెళ్ళిన తరువాత, అదను చూసుకుని మంత్రిగారు రాజకుమారుని దాచిపెట్టి, బండరాయిని నదిలో పడవేసి రాజుతో కుమారుడు నదిలో పడిపోయినట్లుగా అబద్ధం చెప్పాడు. అది విని రాజుగారు ఏమాత్రం ఆలోచించకుండా, ఆలస్యం చేయకుండా, తన మంత్రులతో సంప్రదించకుండానే తన కుమారుణ్ణి రక్షించుకోవడానికి నదిలోకి దూకి వెదుకసాగాడు. చాలాసేపు వెదికి ఎంతో బాధతో పడవ దగ్గరకు వెనుకకు తిరిగివచ్చాడు. అక్కడే క్షేమంగా ఉన్న తన కుమారుణ్ణి చూసి ఎంతో సంతోషించాడు.

అసలు విషయం రాజు విచారించగా, మంత్రి రాజుతో "మహారాజా! మేమింతమంది మంత్రులు, సేనాధిపతులు ఉండగా, మీరే స్వయంగా అంతకష్టపడి నదిలోకి దూకి కుమారుని వెదుకవలసిన అవసరం ఏమున్నది? మీ అనుచరులము కదా! మీరు మమ్మల్ని ఆజ్ఞాపించవచ్చుగా? మేము వెళ్ళి వెదికేవాళ్ళం" అని విన్నవించుకున్నాడు.

తిరిగి మంత్రి మాట్లాడుతూ "మహారాజా! అదే విధంగా భగవంతుడు కూడా తన భక్తులను రక్షించడానికి అమితమైన వాత్సల్యంతో అవతారం ఎత్తి వచ్చి, తన భక్తులను స్వయంగా రక్షించుకుంటాడు" అన్నాడు. అది విని రాజుగారు తన తప్పును తెలిసికొని, పశ్చాత్తాపపడ్డాడు. ఆరోజు నుండి ఆయన భగవంతుని అవతార విశేషాన్ని మనస్ఫూర్తిగా విశ్వసించి, అవతారమూర్తులను అర్చించటం ప్రారంభించాడు.

# స్పర్శమణి - చింతామణి

(వార్తాలాపము నుండి)

సేకరణ - మురళీ

మహారాష్ట్ర దేశంలో ఒక సాధువు వుండేవాడు. నదీ తీరము నందలి ఒక నిర్జన ప్రదేశమున నివసించేవాడు. ఆయన గొప్ప త్యాగి.

ఆ సమీప గ్రామంలో ఒక బీద బ్రాహ్మణుడు పురాణ కాలక్షేపముతో కుటుంబ పోషణ చేసుకొంటూ వుండేవాడు. ఆయన చాలా పవిత్రుడు. రోజులు గడిచిన కొలది ఆయన చాలా దారిద్ర్యం అనుభవించవలసి వచ్చింది. కుటుంబ పోషణ ఎలా? అనే చింత అతనిని వేధించసాగింది. సమీప గ్రామంలో ఉన్న మహాత్ముడు ఏదైనా ఉపాయం చెబుతాడనే నమ్మకంతో ఆయన వద్దకు వెళ్ళి సాధువుతో తన దుఃఖాన్ని వెళ్ళబోసుకున్నాడు.

సాధుమహాత్ముడు 'నీ స్థితిని చూసి నాకు చాలా దుఃఖం కలుగుతోంది. కానీ, నేను నీకు సహాయం చేసే స్థితిలో లేను. నా దగ్గర ధనం లేదు. నేను సంసారాన్ని త్యజించాను" అన్నాడు. అది విని, ఆ బీద బ్రాహ్మణుడు నిరాశతో మహాత్మునికి నమస్కరించి తిరుగు ప్రయాణం అయ్యాడు. అతడు పది అడుగులు వెళ్ళగానే, ఆ సాధువు అతనిని వెనుకకు పిలిచి, "నేను మరచిపోయాను. చాలా రోజుల క్రితం స్నానం చేస్తుండగా నాకు ఒక స్పర్శమణి దొరికింది, దాని అవసరం నాకు లేదు కనుక, ఏ బీదవానికైనా ఉపయోగపడుతుందనే ఊహతో దాన్ని ఒక చెట్టు తొఱ్ఱలో పడవేశాను. నీవు నాతో రా. ఆ స్పర్శమణిని నీకు ఇస్తాను. స్పర్శమాత్రం చేత ఇనుమును బంగారంగా మార్చే శక్తి దానికి కలదు. దానితో నీ దారిద్ర్యం తీరిపోతుంది" అని చెప్పాడు.

ఆ బీద బ్రాహ్మణుడు ఆశ్చర్య చకితుడై, స్పర్శమణితో సమానుడైన ఆ మహాత్ముని తదేకదృష్టితో చూడసాగాడు. తరువాత ఆ సాధువుతో "మహాత్మా! ఓ దయా సముద్రుడా! ఈరోజు నా కన్నులు తెరిపించావు. ఈ స్పర్శమణి చాలా విలువైన వస్తువు. కాని, మీకు ఆత్మసుఖమనే చింతామణి లభించినది. దాని ఎదుట

ఈ స్పర్శమణి పనికిరాని రాయివలె తోచింది. దాన్ని మీరు చెట్టుతొట్టిలో పడవేశారు. ఇక నాకు స్పర్శమణితో పనిలేదు. తమరు నాకు ఆత్మసుఖమనే చింతామణిని ప్రసాదించండి" అని పలికి, ఆ స్పర్శమణిని ఎదురుగా ఉన్న నదిలోకి విసిరివేసి, ఆ మహాత్ముని పాదపద్మాలను ఆశ్రయించాడు!

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2017

01 బుధ - మాఘశుద్ధ పంచమి, శ్రీసద్గురుక్షీరశిలామూర్తి ప్రతిష్ఠ ద్వితీయ వార్షికోత్సవము

03 శుక్ర - రథసప్తమి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

07 మంగ : భీష్మ ఏకాదశి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 శుక్ర మాఘ పౌర్ణమి- సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

21 మంగ : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

24 శుక్ర : మహాశివరాత్రి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

మార్చి 2017

12 ఆది : ఫాల్గుణ పౌర్ణమి, హోలీ, ఉదయం 11గం. సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

23 గురు : శ్రీగురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

29 బుధ : శ్రీ హేవళంబి నామ సంవత్సర ఉగాది, ఉదయం 11గం॥లకు సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

# సృష్టి క్రమము

- పరాశర ప్రసాద్

సత్త్వ ప్రధానమైన ప్రకృతియందు జీవులు ఈశ్వరుని ప్రతి బింబితులు. తమః ప్రధానమైన ప్రకృతి యొక్క వికారము వలన పంచ మహాభూతముల సృష్టి ముందుగా ప్రారంభమైనది. ఈశ్వరుడు సర్వ సృష్టికి అధినేత. ఈశ్వరుని ఇచ్ఛయే ఆజ్ఞ. దాని ఫలితంగా తమోగుణ ప్రధానమైన ప్రకృతి నుండి పృథ్వి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము అను పంచభూతములు ఉద్భవించాయి.

ఆకాశము నుండి శ్రవణేంద్రియము, వాయువు నుండి స్పర్శేంద్రియము మొదలగు జ్ఞానేంద్రియములు ఏర్పడ్డాయి. అంతఃకరణ సత్వాంశము. పరిణామ భేదము వలన అంతఃకరణ రెండు భాగములు. విమర్శాత్మకమైనది మనస్సు. నిశ్చయాత్మకమైనది బుద్ధి. పంచభూతముల ప్రత్యేక రజోంశముల నుండి వాక్కు, చేయి, పాదము, గుదము, గుహ్యము అను అయిదు కర్మేంద్రియములు ఏర్పడ్డాయి.

పంచభూతముల రజోంశములన్నీ చేరి ప్రాణము ఏర్పడుతోంది. ఈ ప్రాణము పరిణామ భేదము చేత ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము అను పంచ ప్రాణములుగా పరిగణింప బడుతున్నాయి.

సూక్ష్మ శరీరము జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, ప్రాణపంచకములు, మనస్సు, బుద్ధి అను పదునేడింటిచే ఏర్పడుతోంది. దీనికే లింగ శరీరము అని పేరు. అవిద్య అను కారణ శరీరము సూక్ష్మ శరీరముతో చేరుతుంది. సూక్ష్మశరీరముతో తాదాత్మ్యము పొందు ప్రాజ్ఞుడు తైజసుడు. స్థూల శరీరము కల్పించుటకు పంచభూతముల పంచీకరణతో జరాజములు, అండజములు, స్వేదజములు, ఉద్భిజములు అని నాలుగు విధములైన శరీరాలు ఏర్పడ్డాయి.

స్థూల శరీరము నందు అభిమానించినవాడు తైజసుడు విశ్వుడు అని పిలువబడుతున్నాడు. అవిద్య యందు ప్రతిబింబించిన బ్రహ్మము జీవుడవుతున్నాడు. అవిద్య యందలి రజోస్తమో గుణముల హెచ్చు తగ్గుల చేత దేవతలు పశుపక్షులు అనబడే జీవులు ఏర్పడటం జరుగుతోంది. అవిద్యను కారణ శరీరం అంటారు. దీని యందు

అభిమానంగల జీవుడు ప్రాజ్ఞుడు. 'శీర్యతే ఇతి శరీరః' శరీరం నశించేదే. మాయ యందు ప్రతి బింబించిన బ్రహ్మము ఈశ్వరుడు.

పంచభూతములలో ప్రతి భూతము రెండు భాగములయి అందు రెండవ భాగము మరల నాలుగు భాగములయి, ప్రతి భూతము యొక్క అర్ధభాగమునకు ఇతర భూతముల నుండి ఒక్కొక్క భాగము చేరుటచేత స్థూల భూతము ఏర్పడుతోంది. స్థూలభూతముల చేరికతో బ్రహ్మాండము ఏర్పడుతోంది.

సుఖం అనేది ఆత్మ స్వరూపమే!
ప్రపంచ వస్తువులలో సుఖం అనేది లేదు.
మనస్సు ఆత్మ వైపు తిరిగినప్పుడు అది ఆత్మ సుఖాన్ని అనుభవిస్తోంది.
మనస్సు బయటకు వచ్చినప్పుడు దుఃఖాన్ని అనుభవిస్తోంది.
మనస్సును బయటకు రానీయకుండా ఆత్మలో నిలకడగా ఉండేటట్లు
చేయటమే సకల సాధనల సారము

- శ్రీ రమణ మహర్షి

## పూజ్యశ్రీ మాతాజీ సత్సంగములు

**పెదనిండ్రకొలను శాఖ** - 3-2-2017 నుండి 7-2-2017 వరకు.
వివరములకు - సెల్. 9491222652
**గుండుగొలను శాఖ** - 19-2-2017 నుండి 21-2-2017 వరకు
ప్రథమ వార్షికోత్సవ మహోత్సవముల సందర్భముగా పూజ్యశ్రీ మాతాజీవారి సత్సంగ సమావేశాములు.
వివరములకు - సెల్ - 98491 34442 ; 93465 35357

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి)

- సుషుమ్నా ప్రసాద

**వీతహవ్యుని కథ**

"ఓ ఆనందమా! నీకు కూడ వీడ్కోలు చెప్తున్నాను, ఒక జన్మ నుండి మరొక జన్మకు మారుతూ అసంఖ్యాకమైన జన్మలలో, నీచేదు సుఖాలను చవిచూచేట్లు, నన్నాకర్షించావు, ఈ ప్రపంచములో నేను నీతో యీ ఆట చాలు, చాలు."



"ఓ యింద్రియ సుఖాలా! మీరు నన్ను చాలా కాలం మోసం చేశారు. నేను మీకందుబాటులో లేను, మీకు నేను వీడ్కోలు చెప్తున్నాను, మీరు నన్ను సచ్చిదానంద స్వభావమును మరచిపోయేట్లు చేశారు."

ఓ బాధా! నీవు నా రక్షకుడవు! నా కళ్ళు తెరిపించావు, నీవు మారు వేషంలో ఆశీర్వచనంలో నాకు మేలు చేశావు, నీవు ఆత్మ యొక్క నిత్యానందమును నాకు తెలియజేశావు. నీ వల్ల మాత్రమే నేను లక్ష్యార్థ శిఖరాగ్రమును చేరుకొన్నాను ఆత్మ విచారణ, ధ్యాన సమాధి సాధనకు నీవు దారి చూపావు."

"ఓ శరీరమా! జన్మకు వచ్చినప్పటి నుండి నీవు ప్రథమ సన్నిహిత మిత్రుడవు. నిన్ను నేనిప్పుడు విసర్జిస్తున్నాను, నిన్ను నేను సముచితముగ గౌరవిస్తాను, నీవు నాకు చాలా బాధలు కలిగించినప్పటికి, నీ సహాయము చేతనే, నేనీ సంసార సాగరమును దాటగలిగాను."

"ఓ ఆత్మాశా! నాకిప్పుడు సంతృప్తి వున్నది, నాకీ ప్రాపంచిక లాభాలతో నిమిత్తంలేదు. నేను మోక్షమనే వున్నతోన్నతమైన సంపదను సాధించాను, నాకింత కంటే మించిన లాభమింకొకటి లేదు, నీకు వీడ్కోలు చెప్తున్నాను."

ఓ అనుబంధమా, కామమా! మీరు నన్నింక బాధించలేరు, నేను ఇప్పడు వైరాగ్యమును, పవిత్రతను సంతరించుకొన్నాను."

"ఓ నా మధురమైన గుహా! నీకు నేను మొకరిల్లు తున్నాను, ఎందుకంటే నా ధ్యాన సాధనకు నీవు దోహదం చేశావు, నేనీ ప్రపంచము

యొక్క రణగొణ ధ్వనిలో బాగా అలసిపోయినప్పడు, నీవొక్కతివే (గుహ) నాకు శరణ్యమయ్యావు"

"ఓ నా కర్రా! (చేతికర్ర) నా అలసత్వమును, విసుగుదలను తొలగించటానికి, నీవు నాముఖ్య స్నేహితుడవు, వయసు మళ్ళిన శరీరపు నడకకు, నీవే వూతమిచ్చావు."

"నాకు జీవశక్తినిచ్చిన ఓ నా ప్రాణాలా! ఇప్పడు మీకు వీడ్కోలు చెప్తున్నాను. ఎన్నో జన్మ పరంపరల నుండి మీరు నాతో సహచర్యం చేశారు."

"ఓ సత్కార్యములరా! మీకు నేను మరల, మరల ప్రణమిల్లుతున్నాను, మీ సహకారము వల్లనే నన్ను దుష్కార్యముల నుండి రక్షించి, అంతిమ ధ్యేయమైన మోక్షమును పొందేట్లు చేశారు"

"ఓ సోదరులారా, స్నేహితులారా! మీ అందరి వద్ద సెలవు తీసుకొంటున్నాను, మీరందరూ ఆనందము పొందుదురుగాక మీరందరూ అంతిమ ధ్యేయమును సాధింతురుగాక!".

"విషయ వాసనలను, సంకల్పాలను పారద్రోలే ప్రణవ నాదమును సున్నితంగా పూరించాడు ప్రణవము పైనేకాగ్ర ధ్యానము చేశాడు. అంధకారమదృశ్యమై, వెలుగు ప్రసరించింది, అతని హృదయం కూడ, కాంతివంతముగ వున్నది, అప్పడు తను శిలలా స్థిరంగా వుండిపోయాడు. తురీయావస్థను పొందాడు, తానే పూర్ణమైన సచ్చిదానందమైనాడు, ఇప్పడు నాస్తికుల నాస్తికత్వము, బ్రహ్మవాదుల పరబ్రహ్మము, సాంఖ్యుల యొక్క పురుషత్వము, యోగుల యొక్క యీశ్వరత్వము, శైవుల యొక్క శివత్వము, కళాకారుల యొక్క కళ, మాధ్యమికుల యొక్క మధ్యమం అతనికి శూన్యంగా గోచరించింది. "ఏది సర్వ వ్యాపకమో, యేది మహాత్ములు, మహర్షులనుభవ పూర్వకముగా తెలుసుకొన్న సత్యమో, యేది సర్వ జ్యోతులను ప్రకాశింప చేసే జ్యోతియో, యేది వొకటై, అనేకంగా గోచరిస్తుందో, యేది అన్ని శాస్త్రాలకంతిమ గుర్తింపో, యేది ప్రపంచమునకు మూలము, ఆధారమో, ఆ సత్, తానైనాడు, అతనలా యిరవై వేల సంవత్సరాలు, వుదాత్త స్థితిలో వుండి, ప్రపంచమంతా, ఆనందంగా సంచరించాడు, క్రమేపి అతను కాంతిలో కాంతిగా లీనమై విదేహ ముక్తుడైనాడు. - సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2017

07 మంగ : భీష్మ ఏకాదశి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

10 శుక్ర మాఘ పౌర్ణమి- సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

21 మంగ : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ

24 శుక్ర : మహాశివరాత్రి - తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీ సద్గురుదేవులకు నమకచమక సహిత అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; అనంతరం శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశ రుద్రాభిషేకాలు; 11గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం; లక్షబిల్వార్చన; భక్తసమారాధన. సాయంత్రం 6-30ని॥లకు శ్రీ ఉమా రామలింగేశ్వరస్వామి సామూహిక కళ్యాణ మహోత్సవం; అనంతరం స్వామివారి నగరోత్సవం.పావులూరులో ఏకాహం

26 : ఆది : అమావాస్య

మార్చి 2017

12 ఆది : ఫాల్గుణ పౌర్ణమి, హోలీ,శ్రీ సద్గురు పాద పూజ.

23 గురు : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

26 ఆది : మాస శివరాత్రి,పావులూరులో ఏకాహం

28 మంగ : అమావాస్య

29 బుధ : శ్రీ హేవళంబి నామ సంవత్సర ఉగాది,ఉదయం 11గం॥లకు పంచాంగ శ్రవణం, శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన. ధ్యాన సప్తా శిబిరం ప్రారంభం.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

సగుణారాధన గొప్పదా? నిర్గుణారాధన గొప్పదా? అన్న ప్రశ్న లేవనెత్తని సాధకుడు ఉంటాడా? సగుణంలోని మాధుర్యం అమోఘం. అది అనుభవించిన వారికే తెలుస్తుంది. సద్గురుదేవులతో సంచరించిన వారి ఆనందాన్ని వర్ణించగలవారెవరైనా ఉన్నారా? సగుణమే లేకపోతే భాగవతం, రామాయణం మనం చదవగలిగేవారమా? పోనీ మహాత్ముల దివ్యలీలలు అవగతమయ్యేవా?



అయితే సద్గురుదేవులు సగుణారాధన నుంచి నిర్గుణారాధనకి ఎదగనిదే ఆత్మజ్ఞానం కలగటం అసంభవం అనేవారు. శాస్త్రజ్ఞానం ఎంత ఉన్నా మహాత్ముల సమాశ్రయం లభించనిదే ఆత్మజ్ఞానం కలగటం అసాధ్యం. మహాత్ముల సందర్శనం, భాషణం, ఆత్మజ్ఞానం పొందాలనే ఇచ్ఛని పెంపొందిస్తారు.

ఆత్మజ్ఞానము అనేది హృదయ కుహరంలో అంతర్గతంగా నిక్షిప్తమైన జ్ఞానము అది వెలుపల గ్రంథపఠనం ద్వారా గాని, ఇతర సాధనల ద్వారాగాని లభించేది కాదు. అది సిద్ధించాలంటే శ్రద్ధ కావాలి. శ్రద్ధ అనేది సద్గురు సమాశ్రయం ద్వారా బుద్ధి యొక్క వికాసము ద్వారా సిద్ధిస్తుంది. 'ధీయోయానః ప్రచోదయాత్' అన్నట్లుగా సద్గురుమూర్తి బోధాశ్రవణం ద్వారా, గురులక్ష్యార్థ సాధన ద్వారా, గురుసేవ ద్వారా కలుగుతుంది.

బుద్ధి వికసించిన మరుక్షణం శ్రద్ధ కలుగుతుంది. ఆత్మజ్ఞానం పొందాలనే ఆసక్తి ఆకాంక్ష, ఆవేదన కలుగుతాయి. తీవ్ర ఆవేదన ద్వారా పురుష ప్రయత్నానికి దోహదం చేస్తుంది. నిప్పు అంటుకున్న ఇంటిలో బందీ అయిన పిల్లి ఎలా తప్పించుకోవాలని ప్రయత్నం చేస్తుందో ఇదీ అంతే. శ్రద్ధ కలిగిన మరుక్షణం శ్రవణం చేసిన గురుబోధ మననానికి వస్తుంది. శ్రద్ధ లేని శ్రవణం నిష్ప్రయోజనం. అది మననానికి రాదు. మననం ద్వారా మనస్సు ప్రేరణ చెందుతుంది. మనుస్సలో ప్రేమ వుదయిస్తుంది. పరమమైన ప్రేమే భక్తిగా రూపొందుతుంది. భక్తి వలన

ఆరూఢమై విచారణ కలుగుతుంది. విచారణ ద్వారా మనస్సు స్థిరపడటమే కాక, మనస్సు అంతా తత్త్వ భావనతో నిండి ఉంటుంది. అప్పుడు నీ మనోభావన, ప్రవర్తన, క్రియ అన్ని తత్త్వ పూరితంగా ఉంటాయి. ఇంక నీ దేహంలోని నవద్వారాల ద్వారా బాహ్య విషయాదులు ప్రవేశించవు కదా! అప్పుడు నీ దేహింద్రియాదులతో ఆచరించే ఏ కర్మ అయినా స్వార్థరహిత నిష్కామ కర్మ అవుతుంది. అటువంటి సాధన భావంతో ఉన్న సాధకుడు జగత్తులో ఏ వ్యవహారాలలో ఉన్నా ఈశ్వర భావానికి భిన్నంగా ఉంటాడా?

ఆ స్థితిలో ఉన్న సాధకుడు సగుణం గొప్పదా? నిర్గుణం గొప్పదా? అనే విచారణ చేస్తాడా? తానెవరో తాను గుర్తించినవాడికి తనకి భిన్నమైనది గోచరిస్తుందా? 'సర్వభూతస్థమేకం నారాయణం' అనేది తప్ప అన్యభావం మనస్సులో ప్రవేశిస్తుందా! అది సగుణమా? నిర్గుణమా? శ్రవణం లేకుండా మననం చేయగలుగుతాడా?

కాబట్టి సగుణం అనేది సోపాదిక బ్రహ్మం. అయితే నిర్గుణం నిరపాదిక బ్రహ్మం. ఘటం విఛ్ఛిన్నం అయితే ఘటాకాశం మహాకాశంలో లీనమైతే అక్కడ భిన్నత్వం ఉందా! దానిని గుర్తించమన్నారు శ్రీగురుదేవులు.

ఏసుక్రీస్తు ఒకనాడు సముద్ర తీరమున సంచరిస్తుండగా భక్తుడొకడు సమీపించి 'ప్రభూ! భగవంతుని పొందటం ఎట్లా?' అని ప్రశ్నించాడు. ఏసుక్రీస్తు అతనిని తిన్నగా సముద్రంలోనికి తీసుకుపోయి, నీటిలో ముంచి అదిమి పట్టుకున్నాడు. కొంతసేపటికి అతనిని విడిచి, పైకి రానిచ్చి, "ఓయీ! ఇంత సేపటి నుండి నీకెట్లున్నది?" అని ప్రశ్నించాడు.

అతడు ఏడుస్తూ 'నేను బ్రతికి బయటపడతాను అని అనుకోలేదు. ఊపిరి ఆడక ఉక్కిరి బిక్కిరియై గిలగిల కొట్టుకున్నాను' అని సమాధానం చెప్పాడు. అప్పుడు ఏసుక్రీస్తు " చూశావా! ఇప్పుడు నీవెట్లు గిలగిల కొట్టుకున్నావో అట్లే భగవంతుని కొరకై నీహృదయం ఉక్కిరి బిక్కిరి అయితే అతడు నీకు సాక్షాత్కరిస్తాడు" అన్నాడు.

- శ్రీ రామకృష్ణ పరమహంస

# ఆనందమే బ్రహ్మ

- రమణ ప్రసాద్

అది ప్రాతఃకాలం. గంగా లహరీ ధ్వని వీనుల విందు చేస్తోంది. చల్లని పిల్లవాయువులు శరీరాన్ని పులకింతలు పెడుతున్నాయి. అక్కడ ఆశీనుడై ఉన్న భృగువు మనస్సులో బ్రహ్మం అంటే ఏమిటి? అదెలాంటిది? అనే జిజ్ఞాస ఉదయించి, అది ప్రాతఃకాల సూర్యకాంతిలా వృద్ధి చెంద సాగింది. వెంటనే ఆయన తన తండ్రి వరుణుడిని సమీపించి, ప్రణామం చేసి, యిలా అడిగాడు. "భగవాన్! బ్రహ్మమని దేనిని అంటారు? దాని స్వరూపం ఏమిటి? దయచేసి, నాకు ఈ విషయాన్ని చెప్పి జ్ఞానతృష్ణ తీర్చి నన్ను తృప్తిపరచండి".

తనయుడి వినమ్రతతో కూడిన ప్రశ్నకు వరుణడు ఎంతో సంతోషించి, సమాధానం తెలిసినా కూడా బ్రహ్మాన్ని గురించి ప్రత్యక్షంగా వర్ణించకుండా దానికొక లక్షణాన్ని యిలా చెప్పాడు "ఈ సమస్త సృష్టీ దేని నుండి ఉత్పన్నమవుతోందో, ఉత్పన్నమైన తరువాత దేని మీద ఆధార పడి నిలబడి వున్నదో, మనుగడ చెంది వున్నదో. చివరకి దేనిలో లీనం అవుతున్నదో ఆ మూలతత్త్వమే బ్రహ్మం. ఆ మూలతత్త్వాన్ని నువ్వు విచారించి, ఆలోచించు; అలా విచారించి తెలుసుకో...".

తండ్రి ఆజ్ఞ మేరకు ఆయన ఉపదేశవాక్యాన్ని ఊతగా చేసుకుని తపస్సు చేశాడు. ఏకాంతంగా కూర్చుని విచారణ చేసి, మననం చేశాడు. ఈ విచారణ చేత అన్నమే మూలతత్త్వమని భృగువుకు గోచరమైనది. ఎలా అంటే అతని దృష్టిలో ప్రాణుల శరీరం అన్నంచేత ఏర్పడింది. అంతేకాక దాని సమస్త కర్మలు అన్నం మీద ఆధారపడి ఉన్నాయి. అలాగే మరణించాక అన్నంలోనే లీనమవుతున్నది. కాబట్టి ఆ మూలతత్త్వం లేక బ్రహ్మం అన్నమే అయి ఉండాలి. (ఇక్కడ అన్నం అంటే పాంచభౌతిక పదార్థమని అభిప్రాయం.) ఇలా తన విచారణ చేత నిశ్చితమైన విషయాన్ని భృగువు తన తండ్రి వరుణుడికి తెలియజేశాడు.

"తండ్రీ! అభ్యాసపూర్వక విచారణ చేత నా బుద్ధికి అన్నమే బ్రహ్మమని గోచరించింది. ఈ నా జ్ఞానం సరియైనదేనా?" అన్నాడు.

అందుకు వరుణుడు "తపస్సు చేత బ్రహ్మాన్ని తెలుసుకో. తపస్సే బ్రహ్మం" అని చెప్పి పంపించాడు.

భృగువు మళ్ళీ తండ్రి వాక్యాలను విచారణ చేయసాగాడు... "అన్నం వలన సకల ప్రాణులు జనిస్తున్నాయి. అది లేకుంటే లోకంలో ఎవరికీ పనులు సాగవు. కానీ ప్రాణం లేకపోతే అన్నంతో ఉపయోగం ఏమిటి? ప్రాణం పోయిన శరీరం ముందు అన్నం ఉంచితే దాని లాభం ఏమిటి? ఆ అన్నం శవాన్ని బ్రతికించలేదు కదా? మనం బలవంతంగా శవం నోట్లో అన్నం పెట్టినా అది బయటకు వచ్చేస్తుంది. కాబట్టి అన్నం యొక్క ప్రయోజనం శరీరంలో ప్రాణం ఉన్నంతవరకే. కాబట్టి స్థూల దృష్టి యొక్క అస్తిత్వానికి ప్రాణమే ముఖ్యం. అది అత్యవసరం. కాబట్టి ప్రాణమే బ్రహ్మం అని నిశ్చయించుకొని వెళ్ళి తన తండ్రికి వివరించాడు.

అంతా విన్న వరుణుడు కుమారుడితో మళ్ళీ "తపస్సుచేత బ్రహ్మాన్ని ఎరుగు. ఆ తపస్సే బ్రహ్మం" అని చెప్పి పంపించాడు.

భృగువు తిరిగి తన విచారణ కొనసాగించాడు .... "ప్రాణుల అస్తిత్వం ప్రాణం మీద ఆధారపడి వున్నప్పటికినీ వారి సమస్త కార్యాలు మనస్సు మీదే ఆధారపడి ఉన్నాయి. మనస్సు లేక పోతే అతడు జీవించి ఉన్నా మట్టి బొమ్మతో సమానమే. మనస్సు ఒక గొప్ప సూక్ష్మ శక్తిగా వుంది. అది సర్వత్రా వ్యాపించి ఉన్నది. నిర్గుణంగా, నిర్వకారంగా వున్న ఆత్మలో కలిగిన 'అనేకమవుతాను గాక, సృజిస్తాను గాక' అన్న సంకల్ప రూప మనోకార్యమే యీ జగత్తు. కాబట్టి మనస్సే మూలతత్త్వం లేదా బ్రహ్మం" అని నిర్ణయించుకుని తన తండ్రికి తెలియజేశాడు.

తండ్రి వరుణుడు తిరిగి అదే సమాధానం! "తపస్సు చేత తెలుసుకో. ఆ తపస్సే బ్రహ్మం"

తండ్రిచేత పంపబడిన భృగువు మళ్ళీ ఏకాంతంలో చేరి యిలా విచారణ చేయసాగాడు .... "మనోగతి వాయుగతిలాగ ఉంది.వాయువు ఎవరికీ అధీనమవటం కష్టం. కానీ ఈ మనస్సును అధీనంలో ఉంచే ఒక శక్తి ప్రాణిలో, మానవుడిలో వుంది. అదే బుద్ధి. కాబట్టి యీ బుద్ధే బ్రహ్మం. ఇలా విచారణచేసి తండ్రి దగ్గరకు వెళ్ళి "బుద్ధి అంటే విజ్ఞానం. అదే బ్రహ్మం" అని వివరించాడు.

అది విని, తిరిగి వరుణుడు "తపస్సుచేత బ్రహ్మం తెలుసుకో. తపస్సే బ్రహ్మం" అన్నాడు. అయితే ఆయన అస్తమానం ఇలా ఎందుకు అంటున్నాడు? సమాధానం తెలిసినప్పుడు చెప్పవచ్చుకదా? అంటే,

శిష్యుని ఉన్నతిని కోరే ఆచార్యుడు దానికి తగ్గ పరిశ్రమను శిష్యునితోనే చేయించి, అతడి బుద్ధి వికాసానికి స్వయం సామర్థ్యతకు చేయూత నిస్తుండేవాడు. శిష్యుడైన భృగువుకు మనస్సులో ఎటువంటి విసుగూ ఉదయించలేదు. పైగా మరింత శ్రద్ధా భక్తులతో, పట్టుదలతో తండ్రి ఆజ్ఞ మేరకు విచారణ చేయాసాగాడు....

"అన్నం, ప్రాణం, బుద్ధి యీ తత్త్వాలన్ని ఒకదానికంటె ఒకటి శ్రేష్ఠమైనవే. ప్రాణులకివన్నీ ఆవశ్యకాలే. కానీ వీటి ఆవశ్యకత ఎందుకు? అన్నం ఎందుకు? ప్రాణం ఎందుకు? మనో కార్యాలు, బుద్ధికి చెందిన జ్ఞానం ఎందుకు?" ... అని తనలో తాను ప్రశ్నించుకున్నాడు. అలా విచారణ చేయగా చేయగా లోలోపల 'ఆనందం కోసం' అని జవాబు లభించింది.

ఆనందం ప్రాణిమాత్ర ధ్యేయమై వుంది. అంతే కాదు. ప్రాణి యొక్క మూల స్వరూపమే ఆనందం. భృగువు అంతర్ముఖుడై యీ ఆనందాన్ని గురించి అన్వేషించే కొద్దీ అతని బుద్ధి యీ తపోరూప అగ్నిచేత సంస్కరింపబడి - శుద్ధి చెయ్యబడి, ప్రస్ఫుటమై ఆత్మనిష్ఠలో లగ్నమైంది. ఆ మీద అతనికి ఈ సర్వానికి మూలతత్త్వమైన 'ఆనందమే బ్రహ్మ'మనీ అది తన ఆత్మస్వరూపమనీ అనుభవంలో గోచరించింది. ఈ అనుభవం చేత అతని జిజ్ఞాస సమాప్తమైంది. ఇక అతనికి తండ్రిని ప్రశ్నించే అవసరమే కలుగదు.

అతని తపోజన్య అనుభూతినే "ఆనందో బ్రహ్మేతి వ్యజనాత్ అనంద్యేవ ఖల్విమాని భూతాని జాయన్తే । ఆనందేన జాతాని జీవన్తి। ఆనందం ప్రయన్త్యభి సంవిశన్తీతి ।" అని.

- ఆనందం నుండే ప్రాణులు పుడుతున్నాయి. ఆనందం చేతనే జీవిస్తున్నాయి. ఆనందంలోనే లయం పొందుతున్నాయి. ఆ ఆనందమే బ్రహ్మమని తెలుసుకోవాలి అని ఉపనిషత్ మంత్రం చాటుతోంది.

కాబట్టి మనమూ ఆ భృగువు మాదిరిగా యీ సాధనను పట్టుదలతో చేసి తపోగ్నిచేత శుద్ధబుద్ధిగలవారమై ఆనందరూప బ్రహ్మాన్ని సాక్షాత్కరించుకొనెదము గాక!!

(తైత్తిరీయోపనిషత్ ఆధారంతో)

# రావణుడు రామునకు నేర్పిన నీతి

- పళని

రామ రావణ యుద్ధం అప్పుడే ముగిసింది. రణరంగమంతా రక్త ప్రవాహాలతో, శవాలతో నిండి ఉంది. రావణుడు యుద్ధ రంగంలోపడి ఉన్నాడు. శరీరమంతా భయంకరమైన గాయాలు, రక్తం. అతనికి ఊపిరి తీసుకోవటానికి కూడా శక్తి చాలటం లేదు. అట్లా బ్రహ్మ అతని నుదుట వ్రాసిన వ్రాత రాముని ద్వారా సఫలం కాబోతున్నది.

రావణుడు కనులు తెరచి చూశాడు. ఇటే వస్తున్నారెవరో? లక్ష్మణుడు! లక్ష్మణుడు వచ్చి "రాముడు మీ వద్ద నుండి రాజనీతిని, జీవితానుభవాన్ని నేర్చుకోవాలని అనుకుంటున్నాడు" అని చెప్పాడు. రావణుడు ఆశ్చర్యపోతూ "సర్వజ్ఞుడైన శ్రీరామ ప్రభువుకు నేను చెప్పగల వాడినా?" అని అన్నాడు.

చిట్ట చివరకు రావణుడు తన జీవితానుభవాన్ని చెప్పటానికి అంగీకరించాడు. శ్రీరాముడే స్వయంగా వచ్చి రావణాసురుడి ఎదుట నిలబడ్డాడు. రామ దర్శనంతో రావణుడు వినయంతో "ఓ సూర్యవంశ శ్రేష్ఠుడా! కరుణించు. స్వయంకృత పాపాలకు బలి అయిపోతున్న ఈ దుష్టునిపై అనుగ్రహ మధువును ఒలికించు తండ్రీ! ఇప్పుడు నన్ను మృత్యువు కబళిస్తోంది. రాక్షసుడైన నేను, జ్ఞానమూర్తివైన నీకు ఏమి బోధించగలను?" అన్నాడు.

"అవును ఎవరి పాపాలకు వారే బలైపోతారు. ఇది తిరుగులేని విధి విలాసము! ఇప్పుడు నేను నీ నుండి లోకానుభవాన్ని, వివేకాన్ని నేర్చుకోవాలని వచ్చాను. రాజ్య నిర్వహణలో నీ దక్షత ఎన్నదగినది. రావణా! నాకు బోధించవలసినది" అన్నాడు శ్రీరామచంద్రుడు.

రావణుడు కొంచెం తేరుకుని తన లోకానుభవాన్ని యీ విధంగా చెప్పటం మొదలు పెట్టాడు. ....

"ఓ రామా! జీవితంలో అత్యంత ముఖ్య విషయం ఏమిటంటే - **మంచి పనిని ఆ క్షణానే చేయాలి! వాయిదా వేస్తే జీవితంలో తిరిగి ఆ పనిని చేయలేము.** నేను అలాగే మూడు మంచి పనులను వాయిదా వేయటం చేత శక్తి ఉండి కూడా చేయలేక పోయాను. అవి ...

1. ఒకసారి నేను పుష్పక విమానం మీద వెళ్తుండగా, నరక లోకంలో యమభటులు పాపులను ఘోరంగా హింసించటం చూశాను. అప్పటికప్పుడే నరక లోకంపై దండెత్తి, నరక ద్వారాలను ఛేదించి, పాపులకు విముక్తి కలిగిద్దామనుకున్నాను.

కానీ అప్పుడు 'రేపు చేద్దాంలే' అని ముందుకు సాగిపోయాను. ఆ తరువాత రేపు రేపు అంటూ వాయిదా వేసుకుంటూ వచ్చాను. ఇప్పుడు మృత్యుముఖంలో నిలబడ్డాను. ఆ పని అలాగే నిలిచిపోయింది.

2. బ్రహ్మదేవుడు పాల సముద్రం, పెరుగు సముద్రం ..... ఇట్లా ఏడు సముద్రాలను సృష్టించాడు కదా! మరి ఆ బుద్ధిలేనివాడు లంకచుట్టూ ఉప్పు సముద్రాన్ని సృష్టించాడేమిటి? వెంటనే ఈ ఉప్పు సముద్రాన్ని పాల సముద్రంగా మార్చివేయాలనుకున్నాను.

కానీ దురదృష్టవశాత్తు ఆ పనిని కూడా రేపు చేద్దామనుకుని వాయిదా వేశాను. ఆ రేపు, రేపుగానే మిగిలిపోయింది.

3. స్వర్గానికి మెట్లు కడదామనుకున్నాను. పాపాత్ములు కూడా ఆ మెట్లు ద్వారా సులభంగా స్వర్గానికి వెళ్ళవచ్చు కదా అని. ఇలా స్వర్గాన్ని సర్వ మానవులకు అందుబాటులోకి తేవాలని చూశాను. కాని వాయిదా వేయటంతో అది కూడా అలాగే నిలిచిపోయింది " అంటూ రావణుడు తన బోధను ముగించాడు.

**ఓడ ఏ దిక్కుకు పోతున్నా అందలి దిక్సూచి యందలి**
**అయస్కాంతం సూది ఉత్తరదిశకే తిరుగుతుంది.**
**అందువల్ల ఓడ మార్గం తప్పదు.**
**అలాగే మనస్సును దైవం వైపుకు త్రిప్పి సంచరిస్తున్న యెడల**
**మనకు ఎట్టి భయము కలుగదు.**

- శ్రీ హనుమత్కాళీ వర ప్రసాదబాబు

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

ప్రథమాశ్వాసము 97వ శ్లోకము -

శుశ్రూషవే యది వచః శ్రుణు మామకేనం ।
పూర్వైదపూర్వ కవిభిర్నకటాక్షితం యత్ ।
నీరాజనక్ర మధురంభవదాననేన్దోః ।
నిర్వాజ మర్హతి చిరాయశసి ప్రదీపః ॥

తాత్పర్యము -



నా ఒకమాట వినగోరెదవేని ఓ కృష్ణా! వినవయ్యా! అద్భుత కవితారసం గల పూర్వ కవుల చేత ఏది వ్రాయబడలేదో, అది నేను చెబుతున్నాను విను. చంద్రుడనే దీపం నీ ముఖబింబానికి హారతిగా యివ్వటానికి సైతం ఎప్పటికీ సరిపోలదు. నీ దివ్య సౌందర్యాన్ని ఎవరు వర్ణించగలరు? అది అపూర్వము, అద్భుతము.

సందులేకుండా నందుని లోగిలో జనం నిండి ఉన్నారు. నందుని ముద్దుల పట్టి పుట్టినరోజునాడు వ్రేపల్లెలో ప్రతిఒక్కరినీ పిలిచింది యశోద. ఇంతకన్న మహద్భాగ్యం ఏముంది? అనుకుంటూ వారింటికి జేరారు జనం.

గగన భాగాన నిలిచి దేవగణాలు భువిలో జరుగుతున్న వేడుకలను చూస్తూ, వ్రేపల్లెలోని గోపాలురం కాకపోతిమే అని వాపోతున్నారు. ఇంక ఉండబట్టలేక ఒకొక్కరూ సామాన్య మానవ రూపాలు ధరించి యీ జనసమూహంలో కలిసిపోయారు. ఎవరూ గుర్తుపట్టలేదు వారిని.

యశోదమ్మ ఎంతో శ్రమపడి పాకశాలలో ఎంతో మధురమైన భక్ష్యాలను వంటకాలను తయారు చేయించింది. వచ్చిన వారందరకీ పంచటానికి, జనాన్ని చూస్తే ఆవిడకు అయోమయంగా ఉంది వంటకాలు అందరికీ సరిపోతాయో లేదోనని. కన్నయ్యకి తల్లి మనస్సులోని ఆవేదన తెలిసింది. జనమధ్యంలో కలిసిఉన్న దేవగణాలలోని పాకశాస్త్ర

ప్రవీణులకు తన కనుసైగతోనే సందేశాన్ని అందజేశాడు. వారు వెంటనే పాకశాలలోకి ప్రవేశించి అద్భుతమైన వంటకాలను తయారుచేశారు. యశోదమ్మకు మాయకమ్మింది జరిగినదేది ఆమెకు తెలియ లేదు.

ముద్దుల కన్నయ్యకి జరపాల్సిన వేడుకలన్నీ జరిపారు. చివరకు హారతి యివ్వటానికి ముత్తయిదులందరూ హారతి పళ్ళెం సిద్ధం చేయసాగారు. కిన్నెరులు, గంధ్వరులు వీనుల విందుగా గానం చేయసాగారు. హారతిపళ్ళెంలో దీపం ఉంచగానే దేవగణాలలోని చంద్రుడు వచ్చి పళ్ళెంలో తాను దీపంగా ఒరిగిపోయాడు. చిన్ని కన్నయ్య ముఖ బింబం చుట్టూ హారతి తిప్పుతూ ఉంటే, స్వామి అద్భుత కాంతుల ముందు ఆ దీపకాంతులు వెలతెలబోయాయి. ముత్తయిదువులంతా ఆశీర్వదించి అక్షతలు వేస్తుంటే, యశోదమ్మ మరింతగా మురిసి పోయింది ఇక తన బిడ్డకు ఏ భయము లేదనుకున్నది. తన కొడుకే సర్వరక్షకుడు అన్న భావన ఆమెకు కలుగలేదు. ఎందుకంటె వాని మాయ ఆమె మీద కప్పిఉన్నందున. తనను పెంచటానికి కన్నయ్య ఆమె మీద తన మాయ కప్పి ఉంచే లీలామానుష విగ్రహుడు! జగన్నాటక సూత్రధారి!!

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

ఫిబ్రవరి 2017

7 మంగ : భీష్మ ఏకాదశి, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురుపాద పూజ. భక్తసమారాధన.

10 శుక్ర మాఘ పౌర్ణమి- రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్త సమారాధన.

21 మంగ : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాదపూజ

24 శుక్ర : మహాశివరాత్రి - ఉదయం 5గం.లకు అభిషేకం; రాత్రి 7గం.లకు శ్రీసద్గురు పాదపూజ.

మార్చి 2017

12 ఆది : ఫాల్గుణ పౌర్ణమి, హెూలీ, ఉదయం 11గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

23 గురు : శ్రీగురుదశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

29 బుధ : శ్రీ హేవళంబి నామ సంవత్సరాది, ఉదయం 11గం॥లకు శ్రీ సద్గురు పాద పూజ.

# విశ్వామిత్రుడు

- రమణ ప్రసాద్

పూర్వం భృగు వంశజుడైన ఋచీక మహర్షి కుశనాభుని కుమారుడైన గాధి వద్దకు వచ్చాడు. గాధి ఆయనను పూజించి వుచితాసనంపైన కూర్చోబెట్టాడు. అప్పుడు ఆ మహర్షి ఆతని పుత్రియైన సత్యవతిని వివాహమాడ కోరాడు. “ నీవు ధవళఛాయ మేని, మేఘ వర్ణం గల చెవులుగల వేయి గుఱ్ఱములు, కన్యాశుల్కంగా తెచ్చి ఇస్తే తన కూతురు నిచ్చి వివాహం చేస్తాను” అన్నాడు గాధి రాజు. ఋచీకుడు వరుణుని అర్థించి అటువంటి గుఱ్ఱాలను తెచ్చి ఇచ్చాడు. గాధి సత్యవతీ ఋచీకులకు వివాహం జరిపించాడు. సతీ సహితుడై ఋచికుడు ఆశ్రమవాసం చేస్తున్నాడు . సత్యవతి పతియే పరమావధిగా సేవలు చేస్తోంది.



ఒకరోజు ఋచీక మహర్షి సత్యవతిని పిలిచి ఒక వరం కోరుకొమన్నాడు. ఆమె,“ తనకొక పుత్రుడిని, పుత్రహీన అయిన తన తల్లికి ఒక పుత్రుడినిమ్మ”ని కోరుకుంది. ఋచీకుడు ఒక యజ్ఞం చేసి అందులో బ్రహ్మ, రాజ మంత్రాలను వ్రేల్చి రెండు గిన్నెలలో పాయసం ఇచ్చి, ఒకదానిని తన తల్లికి, ఇంకొకటి సత్యవతిని తీసికొమ్మని చెప్పాడు.“నీకు బ్రహ్మర్షి, మీ అమ్మకు రాజ శ్రేష్ఠుడు పుడతారు” అని చెప్పాడు. దైవవశాన పాయసపు గిన్నెలు తారుమారు కాగా ఆ పాయసాన్ని వారిరువురూ గ్రహించారు. ఋచీకుడు దివ్యదృష్టితో జరిగినది తెలుసుకొని, “నీకు క్రూరుడైన రాజు పుడతాడు. మీ తల్లికి బ్రహ్మర్షి కలుగుతాడు” అని చెప్పాడు. సత్యవతి విచారగ్రస్తయై వేడుకొనగా, ఆమె పుత్రుడికి గాక ఆమె పౌత్రుడు క్రూర హృదయుడై పుడతాడు” అని చెప్పాడు. కాలక్రమంలో సత్యవతికి జమదగ్ని, గాధి భార్యకు విశ్వామిత్రుడు జన్మించారు.

విశ్వామిత్రుడు బాల్యంనుండి రాజ్యభోగములను అనుభవిస్తూ అల్లారుముద్దుగా పెరిగాడు. అతనికి యుక్త కాలంలో గాధి అతనికి ఉపనయనం చేసి కృశాశ్వుని వద్ద అస్త్ర శస్త్ర విద్యలను అభ్యసించటానికి పంపాడు. విశ్వామిత్రుడు ఆయన వద్ద అస్త్ర శస్త్ర విద్యలను నేర్చి మేటి విలుకాడైయ్యాడు. గాధి స్వర్గస్థుడు కాగా విశ్వామత్రుని

కన్యాకుబ్జమునకు రాజుగా చేశారు.

ఒకనాడు వేటకు ససైన్యంగా అడవికి వెళ్ళి అడవిలో తిరిగి తిరిగి డస్సి వసిష్టుని ఆశ్రమానికి వచ్చాడు. ఆయన ఆనందించి తన నందినీ ధేనువును పిలిచి," అమ్మా! కౌశిక మహారాజు ససైన్యంగా మనకతిథిగా వచ్చాడు. నీ మహిమతో వారికి షడ్ర సోపేతంగా విందు సిద్ధం చేయమ"ని అర్థించాడు. విశ్వామిత్రుడు. తనతో వచ్చిన వారితో విందారగించి, వసిష్ఠుని సంపదకు కారణమైన ధేనువును తనకీయమని కోరాడు. దానికి వసిష్ఠుడు అంగీకరింపక పోవటంతో, ఆ గోవును బలాత్కారంగా తీసికొని పోతుండగా నందిని తప్పించుకొని వసిష్ఠుని అనుమతితో తన దేహాన్నుండి ఆనేక అక్షౌహిణుల సైన్యాన్ని సృష్ఠించింది. ఇరు పక్షాలకు జరిగిన యుద్ధంలోతన పుత్రులు హతమైనారు. విశ్వామిత్రుడు ఎంతో దుఃఖించి, హిమాలయాల పర్వతాలలోఈశ్వరుని గురించి తపస్సు చేయటం మొదలుపెట్టాడు.

కొంతకాలానికి శివుడు ప్రత్యక్షమై వరం కోరుకొమ్మనగా, శంకరధనుర్విద్యా రహస్యాన్ని, సిద్ధచారణాదుల శస్త్రాస్త్రరహస్యములను ఉపదేశింపమని కోరాడు. ఈశ్వరుడు అతని కోర్కెతీర్చి అదృశ్యుడైనాడు. అప్పుడు విశ్వామిత్రుడు వర గర్వంతో అధిక సేనలతో వశిష్ఠుని ఆశ్రమాన్ని చుట్టుముట్టి యుద్ధం చేయసాగాడు. వసిష్ఠుడు తన బ్రహ్మ దండాన్ని అడ్డుపెట్టాడు. విశ్వామిత్రుడు తాను నేర్చిన శస్త్రాస్త్రాలన్నిటినీ బ్రహ్మదండం మ్రింగేసింది. చివరగా విశ్వామిత్రుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రాన్ని వసిష్ఠుడు మ్రింగి మహా తేజస్కుడైనాడు.

ఆ విధంగా పరాభవం పొందిన విశ్వామిత్రుడు క్షత్రియ బలం క్షుద్రమని గ్రహించి, తపస్సు చేసి బ్రహ్మర్షి పదం కొరకు తపస్సు మొదలుపెట్టాడు. ఆ కాలంలో అతనికి హవిష్యంద, మధుష్యంద, దృఢనేత్ర, మహారథులను నల్గురు కుమారులను కన్నాడు. కొంతకాలానికి బ్రహ్మ ప్రత్యక్షమై విశ్వామిత్రునికి రాజర్షిత్వాన్ని ఇచ్చి అదృశ్యుడైనాడు. దానితో సంతృప్తి చెందక విశ్వామిత్రుడు బ్రహ్మర్షిత్వమునకు ఘోర తపస్సు చేయటం మొదలు పెట్టాడు.

- సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

పూజామందిరంలో పూజామూర్తులకు వెనకవైపున కట్టటానికి, అమ్మమ్మను ( రాఘవరావుగారి భార్య) అడిగి ఒక క్రొత్త చీరను తీసుకుని రమ్మన్నారు. అమ్మమ్మగారు వచ్చి "క్రొత్తచీర లేదు బాబూ" అన్నారు.

నిజానికి ఆమె వద్ద ఒక కొత్తచీర ఉన్నది. కాని అది ఎవరికో పెట్టుబడి కోసం ఉంచారు. ఆ మాట విని వేణమ్మ తన కొత్తచీర తెచ్చి యిస్తానంటే శ్రీ బాబు సరేనన్నారు. వేణమ్మ పరుగున వెళ్ళి కొత్తచీర తెచ్చింది. అప్పుడు అమ్మమ్మ గారు "అన్నట్లు మర్చిపోయాను బాబూ! ఒక కొత్త చీర ఉన్నది. తెస్తాను "అన్నారు. శ్రీ బాబు వద్దులే అమ్మా! అది ఏదో వేరేపని కోసం కొని ఉంటారు. ఈ పూజలలో హారతులకు దీపారాధనకు అది మసిబారి, మాసిపోతే, మళ్ళీ కొత్తది కొనవలసి వస్తుంది కదా! వేణమ్మ తెచ్చిన చీర కడదాము" అన్నారు. అమ్మమ్మగారు తమ వలన తప్పు జరిగిందని గ్రహించి, తమ చీర కూడ కట్టమని శ్రీబాబును ప్రాధేయపడ్డారు. సరేనని శ్రీబాబు రెండు చీరలూ అలంకరించారు.



నవరాత్రి పూజలు పూర్తి అయ్యాక వేణమ్మ పూజగదిలో సర్దుదామని వెళ్ళేసరికి, అఖండ దీపపు సెగ మందిరానికి కట్టిన ఆకులకు తగిలి, ఆకులు మండుతున్నాయి. వేణమ్మ హడావిడిగా శ్రీబాబును పిలిచింది. శ్రీబాబు వచ్చి చూసి ఒకక్షణం కనులు మూసుకొని "ఫరవాలేదు, స్నానానికి నీళ్ళు సిద్ధం చెయ్యి. నేను స్నానం చేసివస్తాను" అన్నారు. శ్రీ బాబు స్నానం చేసి వచ్చేవరకు ఆ మంట యింకా వ్యాపించకుండా, అంతవరకే మండుతోంది. వేణమ్మ ఆశ్చర్యంతో "మీ శాసనాన్ని అగ్నిదేవుడు కూడా పాటించాడు బాబూ" అన్నది. శ్రీబాబు చిరునవ్వు నవ్వి "అంతా అమ్మ లీల" అన్నారు. అలంకారం తీసి చూస్తే, జగన్మాత దేవతార్చన పీఠానికి సెగ తగలలేదు. వెనుక కట్టిన రెండు చీరలు

విప్పిచూస్తే, పైన కట్టిన వేణమ్మ చీర చెక్కుచెదరలేదు గాని, మసిబారకుండా ఉండాలని వెనుక వైపున కట్టిన అమ్మమ్మగారి చీర మాత్రం మడతలు పెట్టిన చోట కొద్దిగా కాలి కన్నాలు పడింది.

అమ్మమ్మగారు జరిగింది తెలుసుకుని పశ్చాత్తాప పడుతూ" ఈ దోషమంతా నాదే బాబూ! 'సంశయాత్మా వినస్యతి' అన్నట్లు, నేను చీర యిచ్చేందుకు సందేహించటం వల్లనే , అడుగు వైపున ఉన్నా , నా చీర అలా అయింది. కాని మనస్ఫూర్తిగా సంతోషంతో వేణు యిచ్చిన చీర ,ముందువైపు కట్టి ఉన్నా , అది శుభ్రంగానే ఉంది. ఇది నాకొక గుణపాఠమే బాబూ! " అని లెంపలు వేసుకొన్నారు. శ్రీబాబు "ఇవన్నీ జగన్మాత దివ్యలీలలమ్మా!" అన్నారు. తరువాత శ్రీబాబు జగన్మాత దర్శనానికి కలకత్తా వెళ్ళిపోయారు.

ఈ దసరా పూజలకు ముందుగానే , శ్రీ బాబు కవిగారితో వేణమ్మకు హరికథ చెప్పటం నేర్పించారు. కవిగారు "ఆడపిల్ల హరికథ చెప్పడం బాగుండదేమో" అని సందేహిస్తే, "జగన్మాత సన్నిధిలో అమ్మ సేవకోసం చెప్పిస్తాముగాని బహిరంగ ప్రదర్శనలతో మనకు పనిలే"దని చెప్పి ఒప్పించారు. పూజలలో ఒకరోజు వేణమ్మచేత హరికథ చెప్పించారు. పోతునూరులో మూడేళ్ళపాటు (1955, 56, 57) దసరాపూజలు జరిగాయి. ప్రతిసారీ మరిన్ని ఊళ్ళనుండి జనం వచ్చేవారు.

మూడవ సంవత్సరం నవరాత్రులలోనే ఒకరోజున ప్రొద్దుటి నుంచి జనం రావటం మొదలై సాయంకాలం తీర్థ ప్రసాదాల సమయానికి చాలామంది భక్తులు వచ్చారు. చేసిన వంటలు సరిపోతాయోలేదో అని అమ్మమ్మగారు కంగారుపడి శ్రీ బాబుకు నమస్కరించుకున్నారు. శ్రీ బాబు ఒకసారి ఆ పదార్థాలవైపు చూచి "ఇక వడ్డించండమ్మా! ఎంతమంది వచ్చినా దిగులు లేదు. పుష్కలంగా సరిపోతాయి" అన్నారు. ఎన్ని బంతులకు వడ్డన చేసినా, యింకా పదార్థము మిగిలే ఉన్నది. శ్రీ బాబు "జగన్మాత తనను నమ్ముకున్న ఏ జీవికి ఎటువంటి లోటూ రానివ్వదు" అన్నారు.

- సశేషం

## విష్ణు కథలు

# మీరాబాయి

- రమణ ప్రసాద్

ఆ బాలిక మెల్లగా నడిచి విగ్రహాన్ని సమీపించి శ్రీకృష్ణ దేవుని కళ్ళలో చూసింది. అంతే! అక్కడ విగ్రహం గోచరించడంలేదు. ఆ విగ్రహం నుండి శ్యామసుందరుడు మోహనాకారుడై, విశాలనేత్రాలతో, పీతాంబరం ధరించి, మురళీగానం చేస్తూ బృందావనంలో గోపగోపికలతో నడయాడుతూ దర్శనం ఇచ్చాడు. ఆమె నేత్రాలలో శాశ్వతంగా నిలిచిపోయాడు. ఆమె పరవశంతో–



మేరెతో గిరిధర గోపాల్ దూసరోన కోయీ

గిరిధర గోపాలుడేనావాడు. వేరెవరూకాదు అనిపాడి ఇంకా –

ఐసో వర్ వరో కి చూడా అమర్ హెూ జాయ్

ఐసే వర్ కో క్యా కరనా జో జన్మ తె మర్‌జాయ్ – అని పాడింది.

"నిత్య సుమంగళిగా ఉండేవాడిని వరుడుగా చేసుకోవాలి గాని పుట్టి గిట్టే వరుణ్ణి చేపడితే ఏమిలాభం?" అని నిశ్చయించుకుంది

మీరాకు యుక్తవయస్సు వచ్చింది. ఆమె తండ్రి ఆమెకు వివాహ ప్రయత్నాలు చేస్తుండగా, మీరా తన తండ్రితో నాన్నగారూ! నాకు వరుణ్ణి వెతకవలసినపనిలేదు. నేను నాకు తగిన వరుణ్ణి వరించే ఉన్నాను. అన్నది. "ఆ వరుడు ఎవ్వరు?" అని తండ్రి అడిగితే, మీరా, "తండ్రీ! సమస్త ప్రపంచానికి ఎవరు ఆధారభూతుడో, ఎవని దర్శనానికై దేవతలు తపిస్తూ ఉంటారో, ఆ గిరిధర గోపాలుడే నా ప్రాణనాధుడు" అని నిస్సంకోచంగా చెప్పింది. ఆమె మాటలు విన్న ఆమె తండ్రి విస్తుపోయి, "అమ్మా! నువ్వు ఆరాధిస్తున్న గోపాలకృష్ణుడు సాకారంగా ఎలా వస్తాడు? నిన్ను ఎలా చేపడతాడు? నువ్వు రాజపుత్రికవు, రూపవతివి, యౌవనవతివి. కనుక నువ్వు ఒక సంపన్నుడైన రాజకుమారుని వివాహం చేసుకో, నీ వివాహం అయిన తరువాత నువ్వు నీ భర్త కలిసి

అనవరతం ఆ గోపాలదేవుని ఆరాధించవచ్చు. నా మాట విను" అని చెప్పాడు.

మీరా "తండ్రీ! భక్తవత్సలుడు సత్యవ్రతుని చేతిలో మత్స్యరూపం ధరించి వచ్చి అతనితోపాటు అచ్చట మునులను కూడా ప్రళయార్ణవము నుండి రక్షించలేదా? కూర్మరూపం ధరించి పర్వతాన్ని తన వీపున ధరించి సాగరమధనంలో తోడ్పడి దేవతలకు అమృతాన్ని ఇచ్చి రక్షించలేదా? వరాహ రూపంలో ప్రళయోదధినుండి భూమిని రక్షించలేదా? నరమృగశరీరుడై ప్రహ్లాదుని రక్షించలేదా? తను భక్తజనరక్షకుడని నిరూపించలేదా? అదితి గర్భంలో మానవునిగా పుట్టి మహాబలి చక్రవర్తిని తన పాదంతో పాతాళానికి అణగద్రొక్కి త్రివిక్రముడై ప్రకాశించలేదా? జమదగ్ని తనయుడుగా పుట్టి దుష్ట సంహారం చేసి పరశురాముడిగా ప్రసిద్ధి కాలేదా? దశరథ తనయుడై శ్రీరామచంద్రుడుగా రావణ సంహారం చేయలేదా? యదుకులంలో శ్రీకృష్ణుడుగా పుట్టి పూతన శకట, తృణావర్త, కాళీయ,ధేనుర, ప్రలంబ, కేసి, చాణూర, ముష్టికాది రాక్షసులను సంహరించి కురుక్షేత్ర రణ రంగంలో ఆశ్రితుడైన అర్జునునికి గీతోపదేశం చేసి లోకులను అనుగ్రహించలేదా? కలియుగంలో కల్కిరూపంలో దుష్ట సంహారం చేస్తానని అభయమివ్వలేదా? అట్టి గోపాలమూర్తి నామనోరధాన్ని ఆయన ఎరుగడా? నీవు శంకింపక నన్ను ఆ స్వామికి అర్పింపుమ"ని చెప్పెను. తండ్రి ఆశ్చర్యపడి ఏ శాస్త్రాధ్యయనం చేసి యుండలేదు ఈమెకు ఇంత పాండిత్యం ఎలా వచ్చింది? ఈమె పూర్వ జన్మ సంస్కారమెట్టిదో? గోపాలదేవుని నిర్ణయమెట్లున్నదో? అని తలచి గోపాలమూర్తిని ఆమె చేతికి ఇచ్చి "తల్లీ! నీవు కోరిన వరుని నీకు ఇస్తున్నాను, యధేచ్ఛగా అతనిని సేవించు" అన్నాడు.

మీరా ఆనందభరిత అయి, అనవరతము గోపాలమూర్తికి అలంకారాలు చేస్తూ, మధుర భక్ష్యములను నివేదించుచు, అతని సంకీర్తనం చేస్తూ, సాధువులను ఆరాధిస్తూ, భగవచ్ఛేషాన్ని భుజిస్తూ, సాధుగోష్టి చేస్తూ కాలం గడుపుతోంది.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL